


www.jananinadam.com

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**


ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

**సంప్రదించాల్సి నెంబర్**

9550100197,9490111460



సంపుటి: 1 సంచిక: 285 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | మంగళవారం 27-05- 2025 | ➤ పేజీలు : 8 | ➤ వెల : రూ.2.00

2వ పేజీలో...

## పుతిన్‌కు ఏమైంది..?

## పిచ్చి పట్టిందా?

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, తాజాగా ఉక్రెయిన్‌పై భీకర స్థాయిలో రష్యా తన డ్రోన్లు, మిస్సైళ్లతో దాడి చేసింది. ఈ నేపథ్యంలో మీడియాతో ట్రంప్ స్పందిస్తూ.. పుతిన్ అనుసరిస్తున్న విధానాల పట్ల అసంతృప్తితో ఉన్నట్లు పేర్కొన్నారు. అతనికి ఏమైంది? అనేక మంది ప్రాణాలు బలి తీసుకుంటున్నాడు.. పుతిన్‌కు పిచ్చి పట్టిందా అని ట్రంప్ ఫైర్ అయ్యారు. ఏ కారణం లేకుండానే రష్యా దాడులు చేస్తున్నట్లు ఆరోపించారు. గత వారం రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడుల్ని ఉధృతం చేసింది. సుమారు 764 ఉక్రెయిన్ డ్రోన్లను రష్యా తన భూభాగంలోనే అడ్డుకున్నది.



2వ పేజీలో...

## దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ,మే26 : దేశంలో మరోసారి కరోనావైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. అన్ని రాష్ట్రాలు కరోన పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. దిల్లీలో ప్రస్తుతం 104 మంది వైరస్‌తో బాధపడుతున్నారు. ఒక వారంలోనే 99 మంది దీని బారినపడటం ఆందోళన కలిగిస్తోంది. కేరళలో కేసుల సంఖ్య 400 దాటింది. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 1009గా ఉండగా.. వారం వ్యవధిలో 750 మందికి కొత్తగా కరోనా సోకిందని సోమవారం ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కేసులపరంగా కేరళ మొదటి స్థానంలో ఉండగా.. తర్వాత మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో వైరస్ తీవ్రత కనిపిస్తోంది. తాజాగా బిహార్‌లో తొలి కేసు నమోదైంది. కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీ-వల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది.

### కేరళలో 400 దాటిన కేసుల సంఖ్య



2వ పేజీలో...

## పుతిన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌పై డ్రోన్ల దాడి.. నిజమేనా ?

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరిగినట్లు తెలుస్తోంది. పుతిన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌పై డ్రోన్ల దాడి జరిగినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గుంపులు గుంపులుగా వస్తున్న డ్రోన్ల మధ్యలో పుతిన్ హెలికాప్టర్ చిక్కుకున్నట్లు చెప్పారు. అయితే ఆ దాడి నిజమే అని ఎయిర్ డిఫెన్స్ డివిజన్ కమాండర్ యురీ దాస్కిన్ తెలిపారు. గత మంగళవారం కుర్స్క్ ప్రాంతంలో పుతిన్ పర్యటించారు. ఏప్రిల్‌లో ఉక్రెయిన్ దళాల నుంచి ఆ ప్రాంతం విముక్తి పొందింది. ఈ నేపత్యంలో ఆ ప్రాంతాన్ని పుతిన్ విజిట్ చేశారు. తన పర్యటన సమయంలో గవర్నర్ అలెగ్జాండర్ కిన్షెటిన్‌ను కలివారు. అయితే ఆ సమయంలో ఉక్రెయిన్ డ్రోన్లు.. పుతిన్ హెలికాప్టర్‌ను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఛానల్ రష్యా 1కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..



## జూన్ 19న ఎనిమిది రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు

2వ పేజీలో...




## కాళేశ్వరంలో ముగింపునకు పుష్కరాలు

### చివరిరోజు భారీగా తరలివచ్చిన భక్తులు

కాళేశ్వరం,మే26 : కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి.సోమవారంతో పుష్కరాలు ముగియనున్నాయి. దీంతో చివరి రోజైన సోమవారం భక్తుల రద్దీ నెల కొంది. పవిత్ర త్రివేణి సంగమం లో భక్తులు పుణ్యస్నానాలుఆచరిం చారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వ రస్వామిని దర్శించుకుంటున్నారు. ముగిం పు వేడుకలనుఅట్టహాసంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు-చేస్తున్నారు.



2వ పేజీలో...



- గుజరాత్‌లోని దాహెూద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం
- మోడీతో పోరాడటం ఇంత కష్టమని ఉగ్రవాదులు కలలో కూడా ఊహించి ఉండరు

## మోడీతో పోరాడటం ఇంత కష్టమని.. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించి ఉండరు..

2వ పేజీలో...

ఢిల్లీ,:ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేడు తన సొంత రాష్ట్రం గుజరాత్ లో పర్యటిస్తున్నారు. ఆయన రూ.77 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఐదు నగరాల్లో నాలుగు రోడ్ షోలు, మూడు బహిరంగ సభల్లో ప్రధాని ప్రసంగించనున్నారు. దీనితో పాటు, 'మేక్ ఇన్ ఇండియా' కింద, దాహెూద్‌లో రూ. 21 వేల కోట్లకు పైగా వ్యయంతో ఏర్పాటు చేసిన రైల్వే ఉత్పత్తి యూనిట్‌ను ఆయన ప్రారంభించారు.తన రెండు రోజుల పర్యటనలో మొదటి రోజున, ప్రధాని వడోదర, భుజ్, అహ్మదాబాద్‌లలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. సోమనాథ్-అహ్మదాబాద్ వందే భారత్ రైలును ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. వడోదరలో అద్భుతమైన రోడ్‌షో తర్వాత, ప్రధాని మోదీ దాహెూద్‌కు బయలుదేరి వెళ్లారు, అక్కడ ప్రధాని మోదీ లోకో మాన్యుఫ్యాక్చరింగ్ షాప్-రోలింగ్ స్టాక్ వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ఉద్యోగులతో సమావేశమయ్యారు.



## నేటినుంచి టిడిపి మహానాడు

- భారీగా ఏర్పాట్లు చేసిన తమ్ముళ్లు
- పసుపుమయంగా మారిన కడప నగరం
- తరలివచ్చిన మంత్రులు...నాయకులు
- మూడ్రోజుల పండగ కోసం నేడ చంద్రబాబు రాక

2వ పేజీలో...

కడప,మే26 : మాజీ సిఎం వైఎస్ జగన్ ఇలాఖాలో టిడిపి మహానాడుకు అంతా సిద్దం అయ్యింది. గత ఐదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న టిడిపి, అధికారం వచ్చిన తరవాత జరుగుతున్న తొలి మహానాడు కావడంతో శ్రేణులు మంచి ఊపులో ఉన్నారు. వాతావరణం కూడా చల్లబడడం కలసివచ్చే అంశం.మహానాడు మే ఎండల్లో జరగడంతో ఉక్క పోతలు ఉండేవి. ముందే రుతుపవనాలు రావడం తో ఇప్పటికే వాతవారణం చల్లబడింది. దీంతో కడపలో ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 27, 28,29 తేదీల్లో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహిస్తున్నది. అందుకు అవసరమైన ఏర్పాట్లకు ఆ పార్టీ శ్రీకారం పలికింది. తొలిరోజు జరిగే ప్రతినిధుల సభ జరుగనుంది. మహానాడు సమీపి స్తుండటంతో కడపలో పసుపు పండగ వాతావరణం నెలకొంది. నగరాన్ని పసుపుమయం చేసే ప్రయత్నా ల్లో స్థానిక టీడీపీ నేతలు ఉన్నారు. ఇప్పటికే నగరంలోని ప్రధాన వీధులు, కూడళ్లతోపాటు పాత బైపాస్ రోడ్డు ప్రాంతాలను తోరణాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో అలంకరించారు. మహానాడు జరిగే ప్రాంగణం సమీప ప్రాంతాలన్నింటినీ హోర్డింగ్‌లతో నింపేశారు. అధికారం దక్కడంతో మహానాడును ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది.




### భారీ మొత్తంలో గండి కొడుతున్న నిర్మాణదారులు అక్రమ నిర్మాణాల చాటున కోట్ల రూపాల దందా

## నియమాలకు జోలపాడి.... అక్రమ నిర్మాణాలకు తెరలేపి

### ప్రశ్నిస్తే కేసులంటూ బెదిరింపులు

కూకట్పల్లి , ప్రజాక్రాంతి : వేగంగా అభివృద్ధి చెందుతున్న కూకట్‌పల్లి ప్రాంతంలో అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తూ వెలుస్తు న్న అక్రమ నిర్మాణాలు కట్టడి చేసే నాధుడు కరువయ్యాడు. ఇటీవల కాలంలో అనుమతులు లేకుండానే నిర్మిస్తున్న భవనాలు, గల్లీ వీధుల్లో విస్తరిస్తున్న అపార్టుమెంట్లు, పార్కింగ్ స్థలాలు లేకుండా ఏర్పాటు చేస్తున్న వాణిజ్య సముదాయాలు కూకట్‌పల్లిలో ఉండే నిత్య జీవితాన్ని క్లిష్టతరం చేస్తున్నాయి. ఈ క్రమంలో వాహనాల రద్దీ తో పాటు నీటి మళ్లింపులకు అంతరాయం ఏర్పడడం డ్రైనేజీ సమస్యలు వంటి అనేక మౌలిక సమస్యలు పెరుగుతూ వస్తున్న వాటిని అధికారులు నియంత్రించడంలో విఫలమవుతున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# నేటినుంచి టిడిపి మహానాడు

**మొదటిపేజీ తరువాయి...**

తొలిరోజు ప్రతినిధుల సభతోపాటు రెండవ రోజు సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా తదనుగుణ ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజులకుపైగా ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతుండగా అవి తుదిదశకు చేరుకున్నాయి. మంగళవారం నుంచి జరగబోయే టీడీపీ మహానాడుకు మంత్రులు కడపకు బయలుదేరి వెళ్తున్నారు. ఇప్పటికే చేరుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు మహానాడు ప్రాంగణం వద్ద స్వయంగా పనులు చేపట్టారు. పార పట్టుకుని మట్టి పనులు చేసిన మంత్రి.. తాను ఒక కార్యకర్తనే అనే విషయాన్ని చాటుకున్నారు. వర్షం వల్ల మహానాడు ప్రాంగణంలోకి నీళ్లు చేరాయి. మహానాడు సభా ప్రాంగణ కమిటీ కన్వీనర్‌గా ఉన్న మంత్రి నిమ్మల.. ఈ విషయాన్ని గమనించి స్వయంగా పార పట్టి సభా ప్రాంగణంలో మట్టిని చదును చేశారు. మరోవైపు మంత్రి సవిత కూడా సైకిల్‌పై మహానాడుకు బయలుదేరారు. పార్టీ కార్యకర్తలతో కలిసి సైకిల్ తొక్కుతూ బయలుదేరారు మంత్రి. 44 మంది తెలుగు దేశం కార్యకర్తలతో పెనుకొండ నుంచి కడపకు సైకిల్‌పై ర్యాలీగా పయనమయ్యారు. సత్యసాయి జిల్లా పెనుగొండ పట్టణంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పచ్చ జెండా ఊపి మంత్రి సవిత సైకిల్ యాత్రను ప్రారంభించారు. అనంతరం వైజంక్షన్ వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేర మంత్రి సైకిల్ తొక్కారు. మరోవైపు కడప జిల్లాలో మహానాడు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంత్రి నారా లోకేష్ మహానాడు వద్దకు రానున్నారు. అంతేకాకుండా ఇప్పటికే మంత్రులు, టీడీపీ నేతలు కడపకు చేరుకున్నారు.



మంగళవారం కడప మహానాడుకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లనున్నారు. నేటి నుంచి మూడు రోజుల మహానాడు జరగనుంది. ఇందు కోసం భారీగా ఏర్పాట్లు- చేశారు. కడప జిల్లాలో తొలిసారి జరుగుతున్న మహానాడు కోసం నగరంలో భారీగా స్వాగత తోరణాలను ఏర్పాటు- చేశారు. ఉదయం ప్రతినిధుల నమోదుతో మహానాడు మొదలుకానుంది. తొలిరోజు 27న పార్టీ ప్రతినిధుల సభ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణతో పాటు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియామ వళిలో సవరణలపై ప్రధాన చర్చ జరగనుంది. ఆరు సూత్రాల్లో మొదటి రెండు సూత్రాలపై మొదటిరోజు చర్చ జరగనుంది. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. అలాగే రెండో రోజు ప్రతినిధుల సభతో పాటు- పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించనున్నా రు. ఆరు సూత్రాల్లో మిగిలిన నాలుగు సూత్రాలపై చర్చించి, తీర్మానా లు చేయనున్నారు. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక, ప్రమాణ స్వీకారం తరువాత.. అధ్యక్షుడు ప్రసంగించనున్నారు. ఇక చివరి రోజు భారీ బహిరంగ సభను ఏర్పాటు- చేశారు. ఈ సభకు దాదాపు 5 లక్షల మంది రానున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# నియమాలకు జోలపాడి.... అక్రమ నిర్మాణాలకు తెరలేపి

**మొదటిపేజీ తరువాయి...**

ఇంద్ర హిల్స్, మహంకాళి నగర్ లో అక్రమ నిర్మాణాలు : కూకట్ పల్లి జోనల్ పరిధిలోని ఇంద్ర హిల్స్, మహంకాళి నగర్ లో అక్రమ నిర్మాణాలు ఏదేచ్ఛగా సాగుతున్న అధికారులు మాత్రం చూసి చూడ నట్లు వదిలేస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటూ ఉంటే స్థానికంగా ఉండే అధికారు లు వాటిని సొమ్ము చేసుకుంటూ రోజులు గడిపేస్తున్నారు. కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా లేకుండా ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా టౌన్ ప్లానింగ్ అధికారులకు నిర్మాణదారులు సవాలు విసిరుతూ చక చక పనులు కానిస్తున్నారు. అనుమతి ఇచ్చేది ఒకటి... క్షేత్రస్థాయిలో మరొకటి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నియమాలు ప్రకారం ప్రతి నిర్మాణం యొక్క ప్లాన్‌ను ముందుగా అధికారులు ఆమోదించాల్సిన అవసరం ఉంది. అయితే, కొందరు నిర్మాణ దారులు ఈ నియమాలను విస్మరించి అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ వస్తున్నారు. దీనివల్ల స్థానికంగా ఉండే కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జీ ప్లస్ రెండు అనుమతులు తీసుకొని ఏకంగా ఆరు ఫ్లోర్లు నిర్మాణం చేపట్టడమే కాకుండా మరికొందరు నిర్మాణదారులు ఎటువంటి అనుమతులు లేకుండా అనేకంగా ఐదు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన అధికారులు కుర్చీలకే పరిమితమై తమ పని వారే చేయడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోకల్ గా ఉండేది తామే అంటూ ఇక్కడ ఏ అనుమతి అవసరం లేదంటూ నిర్మాణదారులు తెగేసి చెప్పడం ఎన్ని అంతస్తులైనా కట్టుకుంటాం తమను ఎవరు ఆపలేరంటూ బహిరంగంగానే ప్రగల్భాలు పలుకుతున్న వారిని నియంత్రించే వారి లేరు.

ప్రశ్నిస్తే ఇక పోలీసులతో కేసులే....!: అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే చాలు ఇక వారిపై నిర్మాణదారులు తో పాటు వారికి అండగా నిలుస్తున్న కొందరు నేతలు కేసులు పెడతామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోయారు.



నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా అధికారులను కూడా మేనేజ్ చేస్తూ వారిని మామూళ్ల మత్తులో ముంచి తమ పనులను సక్రమంగా చేసుకోవడమే కాకుండా మరొకరిని ఇలా చేసుకునేలా దారి చూపిస్తున్నారు. అధికారులు ప్రలోభాలకు లొంగి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించ డం పై సర్వత్ర ప్రజల నుండి ఆగ్రహం వ్యక్తం అవుతుంది.

చేతులు మారుతున్న కోట్ల రూపాయలు...: నిర్మాణాల విషయంలో అక్రమంగా నిర్మిస్తే దానికి సంబంధించి కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని స్థానిక జోనల్ కార్యాలయంలో గుసగుసలు వినపడుతున్నాయి. ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని నిర్మాణదారులు, అధికారులు వాటిని అందిపుచ్చుకొని కోట్ల రూపాయలను చేతులు మారుస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాల్సిన వారే చేతులు మారాక పనులు చేసుకోండి అంటూ వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు ఎవరైనా వస్తే ఏం చేయాలి ఎలా చేయాలనేది కూడా వివరించడం విడ్డూరంగా ఉందని పలువురు ఆరోపించారు. ఇలాంటి అధికారుల పైన చర్యలు చేపట్టకపోతే జోనల్ వ్యాప్తంగా ఇబ్బంది తలెత్తే అవకాశం ఉందని స్థానిక కాలనీవాసులు వాపోయారు.

# సగం మానవాళిపై యుద్ధ ప్రభావం..

**50 దేశాల్లో సంక్షోభ పరిస్థితులు**

**ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధాలు, సాయుధ ఘర్షణలు**

**50 దేశాల్లోని సుమారు 130 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం**

**'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్, ఈవెంట్ డాటా' తాజా నివేదికలో వెల్లడి**



న్యూఢిల్లీ, మే 26 : ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, ఘర్షణలు తీవ్రమవుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలు మొదలుకొని, మయన్మార్ అంతర్యుద్ధం, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వరకు.. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 దేశాలు యుద్ధ/ఘర్షణాత్మక పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. దీంతో భూమిపై దాదాపు సగం మానవాళి యుద్ధ సంక్షోభ పరిస్థితులను చవిచూస్తున్నదని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. గత ఏడాది కాలంలోనే 50 దేశాల్లోని 130 కోట్ల మంది ప్రజలు సాయుధ ఘర్షణల ప్రభావానికి గురైనట్టు స్వతంత్ర, లాభాపేక్ష లేని సంస్థ 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్, ఈవెంట్ డాటా' (ఏసీఎల్ఈడీ) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ యాభై దేశాలకు గాను 10 దేశాల్లో అత్యంత విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, 20 దేశాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయని తెలిపింది. తీవ్రమైన ఉద్రిక్తతలు..: '2024లో అత్యంత ప్రమాదకర సంక్షోభంలోకి పాలస్తీనా కూరుకుపోయింది. మయన్మార్‌లో సుమారు 170 సాయుధ గ్రూపులు క్రియాశీలంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో భీకర పోరు సాగుతున్నది. ఇక 2025లో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తారాస్థాయికి చేరాయి' అని ఏసీఎల్ఈడీ పేర్కొన్నది. 1960లో యుద్ధాలు/ఘర్షణల సంఖ్య 15గా, 1991లో ఆ సంఖ్య 53కు చేరుకుంది. అనంతరం 2013లో 30కి తగ్గగా, 2023లో మళ్లీ 59కి పెరిగింది. ఈ యుద్ధాలు/ఘర్షణల్లో మృతిచెందిన వారి సంఖ్య 1960లో 64 వేలు ఉండగా, 1990లో 80 వేలకు చేరుకుంది. 2005లో 12 వేలకు తగ్గగా, 2022లో ఏకంగా 2.77 లక్షలకు పెరిగింది.

మెరుగుపడని పరిస్థితులు: ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు హింస రికార్డు స్థాయికి చేరింది. ప్రపంచవ్యాప్తంగా సగం జనాభా ఈ యుద్ధ ప్రభావాన్ని చవిచూస్తున్న ది. పరిస్థితులు ఏమాత్రం మెరుగుపడుతున్నట్టు కనిపించడం లేదు. యుద్ధం ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత.. తాజాగా గాజాపై గ్రౌండ్ ఆపరేషన్‌ను ఇజ్రాయెల్ మరింత ఉద్ధృతం చేసింది. ఇక శాంతి చర్చలు జరుగుతున్న సమయంలో, ఉక్రెయిన్‌పై గత మూడేండ్లలో ఎన్నడూ లేనంతగా రష్యా వైమానిక దాడులకు దిగింది.

# రోడ్డు భద్రత పాటించండి.. ప్రమాదాలను నివారించండి.

## ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్



పెద్దపల్లి మే 26. రోడ్డు భద్రత పాటించి ప్రమాదాలను నివారించాలని పెద్దపల్లి ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై హెల్మెట్ పెట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ డిసిపి కార్యాలయం నుండి పెద్దపల్లి కమాన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సి ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. నేడు వాహనదారులు చాలామంది హెల్మెట్ పెట్టుకోకపోవడంతోనే ప్రమాదాలు జరిగి మరణించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ రోడ్డుపై వెళ్లే సమయంలో రోడ్డు భద్రత గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని అలాగే అత్యధిక వేగంతో వెళ్లకుండా ఉండాలని పేర్కొన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపకూడదని ప్రతి వాహనదారుడు ఇన్సూరెన్స్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే మైనర్లకు ఎవరైనా వాహనాలు ఇచ్చినాచో వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె ఆర్ సి శేఖర్ ఈ డి శ్రీనివాస్ రెడ్డి జీఎం లు సతీష్ సురేష్ డి ఎం వెంకట్రాజం బి ఎం లు మల్లెతుల శ్రీనివాస్ యాదవ్ మహేందర్ డి వో లు కొట్టే భూమయ్య, గాజుల ప్రసాద్, బాల శివప్రసాద్, దూడం సతీష్ జాన్ సాగర్ రావు గుజ్జుల రాజిరెడ్డి, గంగుల కుమార్ అత్య చంద్రమౌళి, జబ్బర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## మోడీతో పోరాడటం ఇంత కష్టమని ఉగ్రవాదులు కలలో కూడా ఊహించి ఉండరు..

**మొదటిపేజీ తరువాయి...**

గుజరాత్‌లోని దాహోద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య కాదని అన్నారు. ఇది మన భారతీయుల సంస్కృతి, భావాల వ్యక్తీకరణ. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసే వారు మోడీతో పోటీ పడటం ఎంత కష్టమో కలలో కూడా ఊహించి ఉండరు. పిల్లల ముందే తండ్రిని కాల్చి చంపారు. ఈరోజు కూడా ఆ ఫోటోలు చూసినప్పుడు నా రక్తం మరిగిపోతుంది. ఇది 140 కోట్ల మంది భారతీయులకు సవాలు విసిరింది. కాబట్టి మోడీ దేశస్థులు అతనికి ఇచ్చిన పనిని చేశాడు. మోడీ తన త్రివిధ సైన్యాలకు స్వేచ్ఛా హస్తం ఇచ్చారు. మన సైన్యం గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచం చూడనిది చేసింది. సరిహద్దు వెంబడి పనిచేస్తున్న తొమ్మిది అతిపెద్ద ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఏప్రిల్ 22వ తేదీన పాక్ ఆడిన ఆటను మే 6వ తేదీ రాత్రి 22 నిమిషాల్లోనే మేము నాశనం చేసాము. కానీ పాకిస్తాన్ సైన్యం సాహసోపేతంగా వ్యవహరించినప్పుడు, మన సైన్యం పాకిస్తాన్ సైన్యాన్ని ఓడించింది అని మోడీ అన్నారు.

## 2నుంచి స్లాట్ బుకింగ్ విధానం



హైదరాబాద్,మే26: అవినీతిరహితంగా,పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో ఆధార్ -ఈ సంతకం కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువరావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఆధార్-ఈ సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు.సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో స్టాంప్స్,రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి స్లాట్ బుకింగ్ విధానం, పని భారం అధికంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్‌ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌లపై మంత్రిగారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌తోపాటు- రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్-ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకువస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ ఆర్ వోలను నియమించారు. అవినీతికి దూరంగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వ పేరు ప్రతిష్టలు పెంచేవిధంగా సబ్ రిజిస్ట్రార్‌ల పనితీరు ఉండాలన్నారు.

**వీలైనంత త్వరగా ఆధార్ -ఈ సంతకం అమలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

## జూన్ 19న ఎనిమిది రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి...**

న్యూఢిల్లీ : 8 రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సోమవారం ప్రకటించింది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జూన్ 2న విడుదల చేయనున్నట్లు ఇసిఐ పేర్కొంది. అస్సాం నుండి ఇద్దరు, తమిళనాడు నుండి ఆరుగురు మొత్తం ఎనిమిది మంది సభ్యుల రాజ్యసభ పదవీకాలం జూన్ మరియు జులైలలో ముగియనుంది. అస్సాం నుండి బీరేంద్ర ప్రసాద్ బైశ్యా (బిజెపి), మిషన్ రంజన్ దాస్ (బిజెపి)ల పదవీకాలం జూన్ 14న ముగియనుంది. తమిళనాడు అధికార పార్టీ డిఎంకెకి చెందిన ఎం.షణ్ముగం, పి.విల్సన్, ఎం.మొహమ్మద్ అబ్దుల్లాలతో పాటు (డిఎంకె), అన్బుమణి రామదాస్ (పట్టాలి మక్కల్ కచ్చి-పిఎంకె), ఎన్.చంద్రశేఖరన్ (అన్నాడిఎంకె), మరియు వైకో (మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం-ఎండిఎంకె)ల పదవీకాలం జులై 24న ముగియనుంది.

## పుతిన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌పై డ్రోన్ల దాడి.. నిజమేనా ?

**మొదటిపేజీ తరువాయి...**

శత్రు దేశం డ్రోన్లతో దాడి చేసిందని, ఆ దాడి సమయంలో పుతిన్ తన హెలికాప్టర్‌లో ఉన్నారని, సమర్థవంతంగా తమ దళాలు ఆ డ్రోన్ దాడిని తిప్పికొట్టినట్లు కమాండర్ దాస్కిన్ తెలిపారు. కుర్స్క్ ప్రాంతంలో పుతిన్ పర్యటిస్తున్న సమయంలో.. అసాధారణ రీతిలో యూఏవీలను ఉక్రెయిన్ వదలింది. అయితే తమ దళాలు 46 యూఏవీలను కూల్చినట్లు రష్యా కమాండర్ పేర్కొన్నారు.డ్రోన్ల దాడి సయమంలో తమ వైమానిక రక్షణ దళాలు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ కంబాట్ విన్యాసాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రెసిడెంట్ హెలికాప్టర్ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. శత్రు డ్రోన్లను తిప్పికొట్టామని, ఏరియల్ టార్గెట్లను పేల్చివేసినట్లు దాస్కిన్ తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు సుమారు 764 ఉక్రెయిన్ డ్రోన్లను నేలకూల్చినట్లు రష్యా పేర్కొన్నది. శనివారం, ఆదివారం కూడా వందల సంఖ్యలో మానవరహిత వైమానిక వాహనాలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ దేశాల సహకారంతో రష్యాపై దాడులకు ఉక్రెయిన్ తెగిస్తున్నట్లు విదేశాంగ మంత్రి తెలిపారు.

## దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

**మొదటిపేజీ తరువాయి...**



అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపిన సంగతి తెలిసిందే.ఇటీవల ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు- చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీ-వల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటు-న్నారని వైద్య నిపుణులు వెల్లడించారు. అవే ఉపరకాలను భారత్‌లో గుర్తించినట్లు- ఇటీ-వల ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియంగత వారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

## కాళేశ్వరంలో ముగింపునకు పుష్కరాలు

**మొదటిపేజీ తరువాయి...**

తెలంగాణలో సరస్వతి నది పుష్కరాలు మే 15న ప్రారంభమైన సంగతి తెలిసిందే. కాళేశ్వరంలో ఆధ్యాత్మికతతో శోభిల్లిన సరస్వతి పుష్కరాలు నేటితో ముగియనున్నాయి. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల కోసం వేలాదిమంది భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి నదిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు దంపతులు కలిసి త్రిగుణాత్మక నదుల సాన్నిధ్యంలో స్నానం చేసి పుణ్యఫలాన్ని అందుకుంటు-న్నారు. తీరం వెంట సైకత లింగాలను ఏర్పాటు- చేసి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అలాగే, పితృదేవతలకు శ్రాద్ధకర్మలతో తీరాన్ని పరిపూర్ణంగా అలాగే పుష్కరాల ముగింపు సందర్భంగా పూజారులు చండీ హోమాన్ని నిర్వహించనున్నారు. చివరి రోజు కావడంతో అధికారులు భారీగా భక్తుల రాకను ఊహించి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు- చేశారు. సరస్వతీ మాత, శుభానందదేవి అమ్మవారుల దర్శనార్థం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఒకవైపు భక్తి భావన, మరోవైపు భక్తుల ఉత్సాహంతో కాళేశ్వరం పుష్కర క్షేత్రంగా ప్రకాశించింది.

## శ్రీశైలం వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్..

శ్రీశైలం : శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే మల్లన్న భక్తులకు ఆలయ అధికారులు గుడ్ న్యూస్ చెప్పారు.ఆలయంలో ప్రస్తుతం శని, ఆది, సోమవారాల్లో ఉదయం, రాత్రి మాత్రమే మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. దీనికి టికెట్లను ఆన్ లైన్‌లోనే ఉంచుతున్నారు. అయితే, స్పర్శ దర్శనం మధ్యాహ్నం స్లాట్‌ను ఆలయ అధికారులు పునః ప్రారంభించారు. తాజా నిర్ణయంతో ఇకపై శని, ఆది, సోమవారాల్లో మధ్యాహ్నం కూడా భక్తులు స్పర్శ దర్శనం చేసుకోవచ్చు. ఆ మూడ్రోజులు మధ్యాహ్నం మల్లన్న స్పర్శదర్శనం చేసుకునే వారికి ఆన్ లైన్‌లో 350 టికెట్లు, కరెంట్ బుకింగ్‌లో 200 టికెట్లు అందుబాటులో ఉంచారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఇటీవల ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వైదిక కమిటీ, వసతి విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం వేళల్లో స్పర్శ దర్శనం కల్పించేందుకు వైదిక కమిటీ, అధికారులు సుముఖత వ్యక్తం చేయడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## పుతిన్‌కు ఏమైంది..? పిచ్చి పట్టిందా?

**మొదటిపేజీ తరువాయి...**

కుర్స్క్ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో అధ్యక్షుడు పుతిన్ హెలికాప్టర్ చుట్టూ డ్రోన్ దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి బదులుగానే రష్యా మిలిటరీ.. ఉక్రెయిన్‌పై అటాక్ చేసింది. కీవ్‌లో ఉన్న డ్రోన్, మిస్సైల్ ప్రొడక్షన్ ప్లాంట్‌పై దాడి చేశారు. ఆది వారం రష్యా జరిపిన డ్రోన్‌దాడిలో 12మంది మృతిచెందారు. సుమా రు 367 డ్రోన్లు, మిస్సైళ్లతో రష్యా అటాక్ చేసింది. డ్రోన్లు, మిస్సైళ్ల దాడి సయమంలో ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతాల్లో ఎయిర్ సైరన్లు మోగాయి. న్యూజెర్సీలో రిపోర్టర్లతో మాట్లాడుతూ.. చాన్నాళ్ల నుంచి పుతిన్ తెలుసు అని, నగరాలు, ప్రజలపై రాకెట్లను వదులుతు న్నాడని, దీన్ని ఇష్టపడడం లేదని ట్రంప్ తెలిపారు. పుతిన్ క్రేజీగా మారినట్లు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రుత్‌లో పేర్కొన్నారు.

జిల్లాలో 22 వేల 20 మంది రైతుల

# ఖాతాలలో 218 కోట్ల రూపాయల జమ

**జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి26:** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 22 వేల 20 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 57 వేల 710 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 218 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 131 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యంను కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను

# క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి26:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన జాడిశంకర్ మండలంలోని మెట్పల్లి శివారులో తనకు గల పట్టా భూమి వేరొకరి పేరిట చూపుతోందని, సవరించి తన పేరిట మార్పు చేసి పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన బోయిన రవీందర్, నెన్నెల మండలం మెట్పల్లి గ్రామానికి చెందిన దుగుట రాజేశ్వరి తమ ప్రాంతంలో మీ-సేవ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మీ-సేవా కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం ఇంధన్పల్లి గ్రామానికి చెందిన లసెట్టి గంగవ్వ గ్రామ శివారులో తనకు గల భూమికి సంబంధించి హద్దులు నిర్ధారించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామపంచాయతీ నాయక్ గూడెంకు చెందిన మంగ శారద తనకు గ్రామ శివారులో ఉన్న భూమి రాళ్లవాగు ఎడమ కాలువలో పోయిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం కొండపేట గ్రామానికి చెందిన అలం మహేందర్ తనకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకం క్రింద బోరు, మోటార్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 32 దరఖాస్తులు వచ్చాయని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి ధరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా కలేక్టర్

# కొడప లక్ష్మణ్ మృతి బాధాకరం

**అడవిని కాపాడేది ఆదివాసులే**

**ఫారెస్ట్ అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరైంది కాదు**

**ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి లక్ష్మణ్ మృత దేహాన్ని పరిశీలించి,మృతి పట్ల ప్రగాఢ**

**సానుభూతి తెలిపిన ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్**



**జననినాదం,ఉట్నూర్ 26:** అడవి పంది దాడిలో కొడప లక్ష్మణ్ మృతి చెందటం బాధాకరమని, ఫారెస్ట్ అధికారులు మృగాలపై ఉన్న ప్రేమను మనుషులపై చూపాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నిన్న రాజులగూడ గ్రామంలో రాత్రి అడవి పంది దాడిలో మృతి చెందిన కొడవ లక్ష్మణ్ మృత దేహాన్ని పరిశీలించారు. తక్షణమే పోస్టుమార్టం నిర్వహించాలని డాక్టర్లను ఆదేశించారు. అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి మృత దేహాన్ని తరలించి, అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసులు అడవినే నమ్ముకొని తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని, అడవిని, అందులో ఉన్న సంపదను కాపాడేది ఆదివాసులేనని పేర్కొన్నారు. కొన్ని ఏళు ్లగా అభివృద్ధికి నోచుకోని ఎన్నో గ్రామాలున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుంటే, ఆ అభివృద్ధి పనులను ఫారెస్ట్ అధికారులు అడ్డు కుంటున్నారన్నారు. ఎఫ్డీపిటీ, ఎఫ్డీఓలు ఆదివాసులతో పాటు గిరిజనేతరూలను ఇబ్బందులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. రోడ్డు సౌకర్యం లేని కారణంగా కోడప లక్ష్మణ్ అడివి పంది దాడిలో మృతి చెందారని, దీనికి ఫారెస్ట్ అధికారులే కారణమని అన్నారు. కొడప లక్ష్మణ్ మృతి బాధాకరమని, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# అటవీ అధికారుల పై అట్రాసిటీ కేసు నమోదు చేయండి

**పోలీస్ అధికారులకు ఫోన్లో ఆదేశించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ తో కలిసి**

**జిల్లా కలెక్టర్ ను కలిసిన దళిత రైతులు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 26:** వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా పరిగణించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అటవీశాఖ అధికారుల పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం న్యాయవాది, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి తో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతులు మీడియాతో మాట్లాడారు. వారికి జరిగిన అన్యాయాన్ని మీడియా కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు రైతులకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదు చేశారు. గత యాభై సంవత్సరాల నుండి రైతులు చామనపల్లి శివారులోనీ సర్వే నెంబర్ 65, 67 లో సాగు చేస్తున్నారని , ఆ భూముల్లో విద్యుత్ మోటార్లు, స్తంభాలు, బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందని, లోన్లు, రుణమాఫీ చేసిందని అన్నారు. 1997లోనే ఫైనల్ పట్టా ఇచ్చిందని తెలిపారు. గత సంవత్సరం నుండి అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీ శాఖ కు చెందినవని రైతులపై దాడులు చేస్తూ, అక్రమంగా కేసులు నమోదు చేసి తమను జైలుకు పంపించారని రైతులు తెలిపారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెంటనే జైపూర్ ఏసీపికి, నీల్వాయి ఎస్ఐకి పోన్ చేసి అటవీశాఖ అధికారుల పై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించారు.

**అటవి అధికారులపై పిర్యాదు చేసిన రైతులు.**

వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో అటవి శాఖ అధికారుల పై నీల్వాయి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. చట్టపరిధిలో వారిని శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు మున్నరాజ సిసోడియా, బిజెపి జిల్లా నాయకులు దుర్గం ఎల్లయ్య, రైతులు బానయ్యా, లింగయ్య, పర్వతాలు, మధుకర్, బాధిత రైతులు పాల్గొన్నారు.

# చెరువుల మరమత్తుల పనులకు భూమి పూజ చేసిన ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు

**జననినాదం,ఉట్నూర్26:** ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట గ్రామంలో రూ.18 లక్షలు, దంతనపల్లి గ్రామంలో రూ.25 లక్షలతో రూపాయల వ్యయంతో చేపడుతున్న చెరువుల మరమత్తుల పనులకు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బజ్జు పటేల్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. రైతులు సాగు చేస్తున్న పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు చెరువులు ఎంతో గానో ఉపయోగపడతాయని అన్నారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న ఫారెస్ట్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలి

**ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్**

**జననినాదం,ఉట్నూర్ 26:** షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాల కోసం, అభివృద్ధికి, పోడు భూముల సాగును అడ్డుకొని భయభ్రాంతులకు గురి చేస్తున్న ఫారెస్ట్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు పటేల్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కవ్వాల్ టైగర్ జోన్ ఉన్న నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కోసం ప్రభుత్వం తగు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, గిరిజనులు, గిరిజనేతరులు సాగు చేస్తున్న పోడు భూముల సాగును అడ్డుకోవడంతో పాటుగా వారిని కేటీఆర్ ఎఫ్డీపీటీ శాంతరాం, ఉట్నూర్ ఎఫ్డీఓ రేవంత్ చంద్ర, సిబ్బందితో కలసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా అడవిని నమ్ముకొని జీవనం సాగించే గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములు, గిరిజనేతరులు సాగు చేస్తున్న పోడు భూములలో మొక్కల నాటేందుకు బలవంతంగా భూములను లాక్కొని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్ లో జిల్లా ఇన్ చార్జీ మంత్రి సీతక్క, అటవీ శాఖ మంత్రి సురేఖ, పీసీసీఎఫ్, ఎమ్మెల్యేలు, ఫారెస్ట్ ఆఫీసర్లు సమావేశంలో అభివృద్ధి, పోడు భూముల సాగుపై సహకరించాలని, ఇతర సమస్యలపై వివరించినప్పటికీ, సదరు అధికారులు విని విననట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో లేని అడ్డంకులు ఇప్పుడు ఎలా వచ్చాయో అధికారులకు తెలియదానని, చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు ప్రభుత్వ పనులు అడ్డుకోవడమే కాకుండా, ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్ర చేస్తున్నారని వీరిపై వెంటనే లీగల్ యాక్షన్ తీసుకొని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు ప్రవర్తన మార్చుకోవాలని, ఆదివాసీలపై, గిరిజనేతరులపై దౌర్జన్యాలకు పాల్పడితే, తిరుగుబాటు చేస్తే మాది బాధ్యత కాదన్నారు. నియోజకవర్గ పరిధిలో కవ్వాల్ టైగర్ జోన్ లో ఉన్న ఫారెస్ట్ చెక్ పోస్ట్ లను ఎత్తివేసి, ఆదివారం అడవి పంది దాడిలో మృతి చెందిన కొడప లక్ష్మణ్ కు నైతిక బాధ్యత వహిస్తూ కుటుంబాన్ని ఫారెస్ట్ అధికారులు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు ఖయ్యూం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, మాజీ సర్పంచ్ లు మర్సుకోల తిరుపతి, జగదీశ్ జాదవ్, నాయకులు ఎక్బాల్, అజిమొద్దీన్ ఉన్నారు.



# పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు ఫారెస్ట్ అధికారుల నుండి రక్షణ కల్పించాలని ఎమ్మెల్యేని కోరిన ఇటిక్యాల రైతులు




**జననినాదం,పెంబి 26:** పెంబి మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ ప్రజలు సాగు చేస్తున్న పోడు భూములను ఫారెస్ట్ అధికారులు లాక్కొనీ మా పొట్టకొట్టడానికి చూస్తున్నారని ఇటిక్యాల గ్రామ రైతులు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్ ని కలసి తమ బాధలను చెప్పుకున్నారు. ఫారెస్ట్ అధికారులు నుండి తమకు రక్షణ కల్పించాలని కోరారు. గిరిజనులతో పాటు దశాబ్దాలు సాగు చేస్తున్న భూములకు ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు విధించారన్నారు. తమ గ్రామ రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం అందజేసీ కోరారు. ఈ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ...సమస్యలను అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

# చెంచాలను వదిలిపెట్టంపేర్నినాని

విజయవాడ: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వల్లభనేని వంశీమోహన్ను పరా మర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన పేర్ని నాని.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం బాగా లేకున్నా కూడా వంశీని ప్రభుత్వం వేధిస్తోందన్న పేర్ని నాని.. ఎన్టీఆర్ పతనానికి వంగవీటి రంగా మరణం కారణమైన తరహాలోనే వంశీకి ఏమైనా జరిగితే వంశీ మరణమే టీడీపీ ప్రభుత్వాన్ని బలి తీసుకుం టుం దంటూ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెంచాగిరి చేస్తున్న ఎవరినీ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు.

# లాభాలంటూరు.. సున్నాలు పెడుతారు




### వాట్సాప్ గ్రూప్‌లో నంబర్ యాడ్ చేసి నట్టేటా ముంచుతున్న సైబర్ నేరగాళ్లు
### ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో రోజు రూ.2 కోట్లకు పైగా దోచేస్తున్న మోసగాళ్లు

హైదరాబాద్,: వాట్సాప్ మేసేజ్‌లతో పాటు తెలియని గ్రూపుల్లో యాడ్ అవుతున్న కొందరు అక్కడ నడుస్తున్న చర్చలు నిజమని నమ్మి నిండా మునుగుతున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్‌లలో గుర్తుతెలియని వ్యక్తులు ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వివిధ గ్రూప్‌లు తయారు చేసి అందులో కొత్తవారిని చేరుస్తున్నారు. అయితే ఆయా గ్రూపుల్లో సగానికి పైగా సైబర్‌ఛీటర్లే ఉంటారు. వీరంతా పెట్టుబడులు, వాటిపై వచ్చే లాభాల గూర్చి చర్చిస్తుంటారు. ఈ గ్రూపుల్లో జరుగుతున్న చర్చలు నిజమని నమ్మి పెట్టుబడులు పెడుతున్న ప్రైవేట్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. మే 21, 22 తేదీల్లో ఇలాంటి కేసులు అనేకం రాచకొండ సైబర్ క్రైం ఠాణాలో నమోదయ్యాయి. మచ్చుకు కొన్నింటిని పరిశీలిస్తే.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి న్యూ క్యాస్టిల్లో అడ్వర్‌టైజింగ్ ఆన్‌లైన్ అసైన్‌మెంట్ గ్రూప్ 020లో చేరాడు. గూగుల్ మ్యాప్స్‌లో రేటింగ్ అంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగం కోసం అందులో చేరిన బాధితుడు మొదట రూ.2 వేల పెట్టుబడి పెట్టాడు. అతడు పెట్టిన పెట్టుబడికి 20 శాతం లాభాలంటూ రిటర్న్ ఇచ్చాడు. ఆ తరువాత వీఐపీ గ్రూప్ అంటూ గూగుల్ డిజిటల్ వర్కింగ్ క్రిప్టో కరెన్సీ –బీటీసీలో ఇన్వెస్ట్ చేయాలంటూ నమ్మిస్తూ బాధితుడి వద్ద నుంచి దఫదఫాలుగా రూ. 34.12 లక్షలు కాజేశారు. మోసమని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంజాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి యూట్యూబ్‌లో బినోమో పివోట్ ఇన్వెస్టింగ్ యాప్ ప్రకటన చూసి దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ట్రేడింగ్ చేశాడు. కొన్ని రోజుల వరకు తక్కువ పెట్టుబడులు పెట్టడంతో లాభాలు పంపిస్తున్నట్లు సైబర్‌ఛీటర్స్ నమ్మించారు. కొన్నాళ్ల తరువాత ఇలా తక్కువ పెట్టుబడితే సంపాదన ఎక్కువ ఉండదని, వీఐపీ, ప్రెస్టేజ్ సభ్యత్వం తీసుకుంటే అందులో డిపాజిట్లపై ఇన్సూరెన్స్ కూడా ఉంటుందంటూ నమ్మించాడు. ఇలా సుమారు నాలుగు సంవత్సరాలలో 434 ట్రాన్సాక్షన్స్‌లతో రూ.2,40,85,778 పెట్టుబడిగా పెట్టగా ఆరుసార్లు రూ.8,24,997 లాభం పొందాడు. రూ. 2,32,60,781 మోసపోవడంతో బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

ఆదిబట్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఫోన్ నంబర్‌ను ఎస్ఎంఎస్–716 ఇన్వెస్ట్‌మెంట్ అనే పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌నకు కలిపారు. అందులో 100 మంది సభ్యులుండగా అడ్మిన్ ఫోన్ చేసి అరోరా మ్యాక్స్ యాప్‌ను డౌన్‌లో చేసుకోవాలని సూచించింది. మొదట కొన్ని పెట్టుబడులకు మంచి లాభాలిచ్చారు. నమ్మకం కుదరడంతో తన పెట్టుబడిని బాధితుడు పెంచుతూ వెళ్లాడు. ఇలా రూ. 37.75 లక్షలు పెట్టుబడి పెట్టగా రూ.4.5 లక్షలు బాధితుడికి తిరిగి వచ్చాయి. మిగతా రూ. 33.25 లక్షలు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తే 20 శాతం బ్రోకరేజి ప్రత్యేకంగా చెల్లించాలని, ఆ మొత్తం చెల్లిస్తేనే మిగతావి విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు ఉంటుందంటూ షరత్ విధించారు. బాధితుడు ఆరోరా మ్యాక్స్ యాప్‌పై ఆరా తీయడంతో అదంతా ఫ్రాడ్ అని తేలడంతో రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయుడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.రామాంతాపూర్‌కు చెందిన ఒక ఇంజినీర్ ఫోన్ నంబర్‌ను హెచ్ఎస్‌బీసీ ఐ–068 గ్లోబల్ ఫైనాన్స్ వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. అందులో 90 మంది సభ్యుల వరకు ఉన్నారు. ఆ గ్రూప్‌నకు అడ్మిన్‌గా ఉన్న రియా బన్సాల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఫోన్ చేసి హెచ్ఎస్ఎస్‌పీఎంఏ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలొస్తాయని.. ఐపీఓలు కూడా తక్కువ ధరకు వచ్చేస్తాయంటూ నమ్మించింది. ఒకటి రెండు సార్లు తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టడంతో లాభాలు చూపించిన సైబర్‌నేరగాళ్లు ఇన్ఫోనేటివ్ సొల్యూషన్ లిమిటెడ్‌కు చెందిన 50200 షేర్స్ అలాట్ చేశారని వాటి ధర రూ. 51.27 లక్షలు కాగా డిస్కౌంట్‌లో రూ.26 లక్షలకే వస్తాయంటూ నమ్మించారు. దీంతో బాధితుడు ఆ డబ్బును చెల్లించాడు. తరువాత స్క్రీన్‌పై కన్పిస్తున్న డబ్బులను విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కాకపోతే నిర్వాహకులకు ఫోన్ చేశారు. రూ.3లక్షలు చెల్లిస్తే విత్‌డ్రాకు అప్షన్ ఇస్తామని నమ్మించారు. దీనిపై అనుమానం వచ్చిన బాధితుడు తెలిసిన వారితో ఈ విషయం చర్చించడంతో అదంతా మోసమని తెలిపారు. దీంతో రాచకొండ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఇందులో రూ. 21,500 లాభం చూపించి రూ. 25.80 లక్షలు సైబర్‌నేరగాళ్లు కాజేశారు.

## కదులుతున్న ఎవరెస్ట్.. సంవత్సరానికి కొన్ని మిల్లీమీటర్లు స్థానభ్రంశం



న్యూఢిల్లీ : ఎవరెస్ట్ శిఖరం నెమ్మదిగా కదులుతున్నట్లు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) డాటాను బట్టి తెలుస్తున్నది. భారతదేశం, యూరేసియా మధ్య భూమి లోపలి భాగంలో ఘర్షణల వల్ల ఎవరెస్ట్ సంవత్సరానికి కొన్ని మిల్లీమీటర్ల చొప్పున ఈశాన్య దిశగా కదులుతున్నట్లు గుర్తించారు. ఈ కదలిక ఆగిపోయే సంకేతాలు కనిపించడం లేదు. దీనికి 75 కి.మీ. దూరంలోని అరుణ్ నది ఈ శిఖరాన్ని బలంగా ఎత్తుతున్నది. ఈ నదితో హిమాలయ శిలలు కరిగిపోతున్నాయి. దీంతో ఎవరెస్ట్ శిఖరం పడవ మాదిరిగా తేలుతున్నదని అంటున్నారు. భారత్ సంవత్సరానికి 5 సెం. మీ. చొప్పున యూరేసియావైపు వెళుతున్నది. వీటి మధ్య ఎవరెస్ట్ చిక్కుకుని, పక్కకు జరుగుతున్నది. పర్వతారోహకులు కేవలం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం లేదని, వారు భూమి టెక్టోనిక్ ఎలివేటర్‌పై స్వారీ చేస్తున్నారని అభివర్ణిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీగా ముని చంద్రారెడ్డి



తిరుపతి: తిరుపతిలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీగా ముని చంద్రారెడ్డి ని ఇప్పుడు దినపత్రిక,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష యాదవ్, టిటిడి పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా బిజేపి సీనియర్ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, బిజేపి చంద్రగిరి ఇంచార్జ్ మేడసాని పురుషోత్తమ నాయుడు, కార్పొరేటర్ అన్న అనిత యాదవ్, జోష్ ప్రాపర్టీస్ ఎండి డాక్టర్ ఈశ్వర్ ప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యార్లపల్లి గోపి, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చెల్లుబోయిన శ్రీనివాసులు, యూనియన్ రాష్ట్ర కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్, రాష్ట్ర సీనియర్ నాయకులు కల్లుపల్లి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అతిథులు మాట్లాడుతూ మీడియా వారికి అన్ని విధాల అండగా వుంటామన్నారు.


సమాజంలోని సమస్యలని అన్వేషించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న మీడియా పాత్ర మరువలేనిదన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ మీడియా సమస్యల పరిష్కరమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామని వివరించారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇప్పించేందుకు ప్రభుత్వం నుండి రావల్సిన రాయితీల విషయంపై ప్రధానంగా దృష్టి సారించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మునుచంద్రారెడ్డి మాట్లాడుతూ నాకు ఇచ్చిన ఈ పదవినీ జర్నలిస్టుల ప్రయోజనాలకి ఉపయోగిస్తానని అలాగే నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నా మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కుంచించుకుపోతున్న పసిఫిక్!

**ఫలితంగా కొత్త ఖండం ఆవిర్భావం!**

**20-30 కోట్ల ఏండ్లలో సూపర్ కాంటినెంట్ అమేసియా ఏర్పాటు**

**చైనా, ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల అంచనా**



న్యూఢిల్లీ : భూమి స్వరూపంలో మార్పులు రాబోతున్నాయి. పసిఫిక్ మహాసముద్రం క్రమంగా కుంచించుకుపోతున్నది. ఇది పూర్తిగా అంతరించిపోయి, భూమి లోపలి టెక్టోనిక్ ప్లేట్స్ ఒక చోటుకు చేరుకుంటాయి. ఫలితంగా రానున్న 20–30 కోట్ల సంవత్సరాల్లో కొత్తగా సూపర్ కాంటినెంట్ ఆవిర్భవిస్తుంది. ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వవిద్యాలయం, చైనాలోని పెకింగ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అడ్వాన్స్‌డ్ సూపర్‌కంప్యూటింగ్ మోడల్స్‌ను వినియోగించి ఈ అంచనా వేశారు. నేషనల్ సైన్స్ రివ్యూ జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. ఈ పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ చువాన్ హువాంగ్ మాట్లాడుతూ, ప్రతి 60 కోట్ల సంవత్సరాలకు ఒక సూపర్ కాంటినెంట్ ఏర్పడుతుందని, ఇది ఏర్పడటం కోసం 200 కోట్ల సంవత్సరాల కాలంలో భూమిపైగల ఖండాలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఖండాలు కూడా మరో 20 కోట్ల సంవత్సరాల్లో మళ్లీ ఒక చోటుకు చేరుతాయని చెప్పారు. ఫలితంగా ఏర్పడే కొత్త సూపర్ కాంటినెంట్‌కు అమేసియా అని పేరు పెట్టినట్లు తెలిపారు. అమెరికా, ఆసియా ఢీకొన్నపుడు పసిఫిక్ మహాసముద్రం అంతరించిపోతుందని కొందరు విశ్వసిస్తున్నందువల్ల ఈ పేరు పెట్టామన్నారు. పసిఫిక్ మహాసముద్రం మూతపడితే, ఆస్ట్రేలియా మొదట ఆసియాను ఢీకొడుతుందని, ఆ తర్వాత అమెరికా, ఆసియా ఖండాలను కలుపుతుందని చెప్పారు.

## జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ గా బొడ్డు రాజు నియామకం

### నియామక ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్



కరీంనగర్ మే 26: కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ గా బొడ్డు రాజును నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డు రాజు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనను వైస్ చైర్మన్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లీగల్ సెల్ స్టేట్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆ 96 వేల రేషన్ కార్డులు రద్దు



హైదరాబాద్, మే 26, : తెలంగాణ పౌరసరఫరాల శాఖ చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఆరు నెలలుగా బియ్యం తీసుకోని రేషన్‌కార్డుల వివరాలను సేకరించగా.. ఏకంగా 96 వేల కార్డులు అనుమానాస్పదంగా తేలాయి. అధికారులు చేపట్టిన విచారణలో మే 22 వరకు మొత్తం 6 వేలకు పైగా రేషన్ కార్డులు అర్హత లేనివిగా గుర్తించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డే ప్రాథమికంగా ఉండటంతో.. భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ అవకాశాన్ని కొందరు అనర్హులు సద్వినియోగం చేసుకుని అక్రమంగా రేషన్‌కార్డులు పొందుతున్నారని తెలుస్తోంది. మే మొదటి వారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90.71 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. వాటి పరిధిలో 2.93 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. వీరి కోసం ప్రభుత్వం ప్రతి నెలా 1.90 లక్షల టన్నుల బియ్యాన్ని డీలర్లకు పంపిస్తోంది.సన్న బియ్యం పథకం అమలు అయిన తర్వాత ఎక్కువగా నిరుపేదలు రేషన్ తీసుకోవడానికి బారులు తీరుతున్నా.. 1.6 లక్షల మంది మాత్రం పత్తాలేకుండా పోయారు. ఎక్కడా వారు రేషన్ తీసుకుంటున్నట్లు రికార్డులు లేవు. దీంతో.. పౌరసరఫరాల శాఖ వారి జాబితా తీసి.. ఆయా మండలాల్లో తహసీల్దార్ల ద్వారా క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో నివసిస్తున్నారా, లేదా మరణించారా అని పరిశీలిస్తున్నారు. విచారణలో.. వందేళ్ల వయస్సుపైబడి చనిపోయినవారు కూడా రేషన్ లబ్ధిదారుల జాబితాలో పెద్ద సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. మరికొందరికి రెండు వేర్వేరు కార్డుల్లో పేర్లున్నట్లు కూడా సమాచారం. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయానికి పంపిస్తున్నారు.రేషన్‌కార్డుల విచారణలో సూర్యాపేట జిల్లా 100 శాతం విచారణను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కామారెడ్డిలో 83 శాతం, సిరిసిల్లలో 68 శాతం, కరీంనగర్‌లో 63 శాతం విచారణ పూర్తయ్యింది. అయితే.. 12 జిల్లాల్లో మాత్రం ఈ విచారణ ఇంకా మొదలే కాలేదు. ఇప్పటివరకు జరిగిన విచారణలో, కామారెడ్డిలో 726, సిద్దిపేటలో 519, ఖమ్మంలో 371, సిరిసిల్లలో 360, కరీంనగర్‌లో 330, యాదాద్రిలో 176, మెదక్‌లో 106 కార్డులు అనర్హమైనవిగా తేలాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విచారణ పూర్తయిన తర్వాత.. వరుసగా ఆరు నెలల నుంచి రేషన్ తీసుకోని వారిని.. అర్హత లేకున్నా.. రేషన్ కార్డులు పొందిన వారి కార్డులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం. ఇది ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి సహాయపడుతుంది. అంతే కాకుండా.. ఈ కేవైసీ చేయించుకోని వారి కార్డులను కూడా తొలగించే అవకాశాలు ఉన్నాయి.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోదావరిఖని :గోదావరిఖని పట్టణం గాంధీ నగర్ లోని గీతాంజలి హై స్కూల్ 2000–2001 బ్యాచ్ లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల 25 సంవత్సరాల పూర్తి అయినా సందర్భంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం సాయి లీల బంకెట్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి హెడ్ మాస్టర్ కంది రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులు వారు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకొని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు...... ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సీడ్ యాక్సెస్ రోడ్డు టు కరకట్ట



### రూ.60 లక్షలతో రోడ్డు నిర్మాణం
### కరకట్ట విస్తరణకు తొలి అడుగు

అమరావతి : రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు నుండి కరకట్టకు కనెక్టివిటీ విషయంలో సిఆర్‌డిఏ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సీడ్ యాక్సెస్ రోడ్డు నిలిచినపోయిన దగ్గర నుండి కరకట్ట వరకూ రోడ్డును విస్తరించనుంది. దీనికోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 26లోపు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ప్రసుత్తం ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం నుండి బికెఎంఎన్ ఆక్వా జంక్షన్ వరకూ కరకట్టకు దక్షిణ భాగంలో కొత్తగా రోడ్డు నిర్మించనున్నారు. ప్రస్తుతం విజయవాడకు, అమరావతికి అనుసంధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డును వెంకటపాలెంలోని ప్రకృతి ఆశ్రమం వరకూ నిర్మించారు. అక్కడ నుండి పెనుమాక రెవెన్యూ పరిధి ఉండటం, రైతులు పూలింగుకు భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో రోడ్డును అంతటితో నిలిపేశారు. ప్రసుత్తం కరకట్టమీద సింగిల్‌లైను రోడ్డుపైనే ప్రయాణాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కూడా అదే రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల కాలం లో దీనిపై ట్రాఫిక్ పెరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణాభి వృద్ధిశాఖ మంత్రి నారాయణ పెనుమాక, ఉండవల్లి పరిధిలో భూము లివ్వాల్సిన రైతులతో చర్చలు జరిపారు. కరకట్ట విస్తరించాల్సిన ప్రాం తంలో కొంతమంది ముందుకు వచ్చినా ఇంకా భూములు ఇవ్వాల్సిన రైతులూ ఉన్నారు. తాత్కాలికంగా అయినా రోడ్డును విస్తరించాలనే ఉద్దేశంతో కరకట్టకు ఆనుకుని గతంలో నిర్మించిన మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చి కరకట్టను విస్తరించాలని సిఆర్‌డిఎ నిర్ణయిం చింది. దీనిలో భాగంగా రూ.60 లక్షలతో టెండర్లను ఆహ్వానించింది. ఈ రోడ్డును వెంకటపాలెంలో సీడ్ యాక్సెస్ రోడ్డు ఆగిపోయిన చోట నుండి కరకట్ట దక్షిణ భాగంలో ఆక్వా కంపెనీ వరకూ నిర్మించనున్నట్లు సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. మరోవైపు ఆక్వా కంపెనీ నుండి ఉండవల్లిలో ఇరిగేషన్ వర్క్‌షాప్ వరకూ ఎలివేటెడ్ కారిడార్ రూపంలో రోడ్డును విస్తరించేందుకు అవసరమైన ప్రణాళికను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధం చేస్తోంది.



# డోలీ యానం

'అడవి/ ఆకుపచ్చని నీడల్లో/ భారత దేశం/ తన మొదటి పాట పాడుకుంది/ అడవి/ నేల లోతుగా పాతుకున్న/ చెట్ల వేళ్లని నిశ్శబ్ద తపస్సులోంచి/ భారత దేశ జీవన విధానం ప్రాణాలు పోసుకుంది' అంటారు కవి అద్దేపల్లి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా రహదారి అడగని గిరిజన ప్రాంతాల్లో%ా% ప్రాణాలను భుజాలపై మోస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాలంటే అంబులెన్స్ వుండదు. రోడ్డు మార్గం అసలే వుండదు. నిండు గర్భిణీ అయినా, పసిపాప అయినా పండు ముదుసలి అయినా, వారి ప్రాణాలు గాల్లో దీపంలా మిణుకుమిణుకు మనాల్సిందే. అత్యవసర వైద్యానికి రోగుల్ని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వద్దులు, చిన్నపిల్లలను తరడలించడానికి డోలీలే దిక్కు. సరైన రహదారి సౌకర్యం లేక, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం మైళ్ల కొద్దీ దూరం డోలీల్లో మోసుకెళ్లాల్సిన దుస్థితి. మార్గ మధ్యంలోనే మృతి చెందిన సంఘటనలూ కోకొల్లలు.

'డోలీ డోలీ/ నన్ను ముద్దాడిన అమృతం తెర/ ఇక ఈ డోలీలోనే/ విగతజీవిగా మిగలిపోతానేమో../ ఈ ప్రయాణంలో/ తల్లిగా ముద్ర గాంచడానికి/ తల్లి బంధంకి దూరమైతే కారణమెవ్వ్రూ../ చెప్పండి' అంటారో కవి. ఈ తల్లి ప్రశ్నకు సమాధానం దొరికేదెప్పుడు?సాంకేతిక విజ్ఞానం పెరిగి, చంద్రమండలానికి సైతం వెళ్లొస్తున్న రోజుల్లో కూడా గిరిజన గ్రామాలు రోడ్డు వసతిలేక ప్రాణాలు ఫణంగా పెట్టాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో కొన్నిచోట్ల కేవలం కాలిబాట మాత్రమే వుంటుంది. కొన్నిసార్లు మోటార్ బైక్ కూడా వెళ్లడం కష్టమే. దారంతా వాగులు వంకలు, రాళ్లు, ఎత్తుపల్లాలు. అలాంటి చోట అనారోగ్యంతో బాధపడే మనిషిని డోలీలో భుజాలపై మోస్తూ వెళ్లడం ఒక దుస్సాహసం. అలాంటిది.. పార్వతీపురం మన్యం, అల్లూరి, అనకాపల్లి, అరకు, తదితర జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు వైద్యం పెద్ద సవాలు. తాజాగా అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని కొండ శిఖర పివిటిజి గ్రామానికి చెందిన మహిళను అంబులెన్స్ ఎక్కించడానికే ఏకంగా తొమ్మిది కిలోమీటర్లు మోసుకొచ్చారు. అనారోగ్యంతో వున్న ఈ మహిళను ఇటీవలి కాలంలో మూడుసార్లు ఇలా డోలీ కట్టి మోసుకొచ్చారు. గత నెలలో విజయనగరం జిల్లాలోని రెగపుణ్యగిరి నుంచి డోలీలో మోసుకెళుతున్న గర్భిణీ%ా% మార్గ మధ్యంలోనే బిడ్డకు జన్మనిచ్చింది. ఇలాంటి సంఘటనలు, గ్రామాలు అనేకం వున్నాయి. 'అతి బలహీనులకిచ్చే సౌకర్యాల ఆధారంగా సమాజ అభివృద్ధి స్థాయిని కొలవాలి' అంటారు గాంధీజీ. ఈ దేశంలోని ప్రతి పౌరుడికి వైద్యం ప్రాథమిక హక్కు. కానీ, గిరిజన ప్రజలకు మాత్రం అది దుర్భిణీ వేసి చూసినా కనిపించనంత దూరం. 'ప్రతి మనిషికి సమానమైన ఆరోగ్య సేవలు అందించడం మన సమాజపు నైతిక ప్రమాణం' అంటారు డబ్లుహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్. ఆర్భాటంగా జరుపుకునే అమృతోత్సవాలు, గిరిజనోత్సవాలు డోలీ మోత లేకుండా ఒక్క చావునైనా ఆపగలిగిందా? అంటే తెల్లమొహం వేయాల్సిందే. రాకెట్ ప్రయోగాల్లో సెంచరీ చేసిన దేశంలో%ా% కొండ గుండెకు చికిత్స చేసే నైతికత కొరవడింది.

దశాబ్దాలుగా అధికార పీఠాలపై కూర్చున్న ప్రతి ఒక్కరూ 'అభివృద్ధి లక్ష్యం%ా% పథకాలు సిద్ధం' అంటూనే వున్నారు. డోలీయానం సాగుతూనే వుంది. ఏళ్లకేళ్లు గడచిపోతూనే వున్నాయి. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది గిరిజన ప్రాంతాల అభివద్ధి. ఎక్కడైనా ఒకటి అరా శంకుస్థాపనలు జరిగినా%ా% ఆచరణలో గజం రోడ్డు కూడా నిర్మాణమైన దాఖలా ఒక్కటీ కనబడదు. ఇటీవల ఉపముఖ్యమంత్రి చేసిన శంకుస్థాపనే దీనికి నిదర్శనం. అద్భుత కట్టడాల రాజధానే కాదు%ా% అట్టడుగు వర్గాల అభివృద్ధి కూడా అజెండాగా వుండాలి. గిరిజనుల ఓట్లపై వున్న శ్రద్ధ, వారి అభివృద్ధిపై లేదని చెప్పడానికి నిత్యం సాగుతున్న 'డోలీ యానం' కంటే నగ సాక్ష్యాలు ఇంకేముంటాయి. 'ఇది అంతర్జ్వాల/ మనిషనే అగ్గిపుల్లని ఏ రోడ్డుమీద గీసినా భగ్గున మండే/ సమాజ బాధామయ వాతావరణం/ గుండెల్లో రాజుకుంటున్న మహాజ్వాల' అంటారు కవి అద్దేపల్లి. డోలీ యానమన్నది గిరిజన జీవితాల్లో వేదనాభరిత నిట్టూర్పు. అది పాలనా విఫలతను ప్రతిబింబించే నిశ్శబ్ద అరుపు. ఈ నిశ్శబ్ద గళాన్ని ప్రభుత్వం వినాలి. బస్సులు, అంబులెన్స్‌ల కంటే ముందు జనజీవన స్రవంతిలో భాగమయ్యేందుకు అవసరమైన రహదారులు నిర్మించాలి. వైద్య సౌకర్యాలు అందించాలి.


## శ్రీశైలం మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలం: నంద్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం ముక్కంటి మల్లన్న ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు కావడం పైగా సోమవారం శివునికి ఎంతో ప్రీతికరమైన రోజు కావడంతో స్వామి అమ్మవార్లకు దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చా రు. శ్రీశైలం క్షేత్రమంత భక్తజనంతో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు వేకువజామున నుండే పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థమై క్యూలైన్ లో దర్శనం కంపార్టుమెంట్లలో బారులు తీరారు. శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 3 గంటల సమయం పడుతుంది. మరోపక్క భక్తులు రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారంలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చన నిలుపుదల చేశారు. సామాన్య భక్తులకు ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనానికి భారీగా పెరిగిన భక్తులు రద్దీగా ఎక్కువగా ఉండటంతో మూడు విడతలుగా మాత్రమే స్పర్శ దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకునేలా ఆలయ ఈవో శ్రీనివాసరావు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనార్థమై క్యూలైన్లు, కంపార్ట్మెంట్లలో ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు అల్పాహారం, బిస్కెట్స్ మంచినీరు అందిస్తున్నామని దేవస్థానం ఈవో శ్రీనివాస రావు తెలిపారు.

## 'నీకున్న అక్రమ సంబంధాన్ని బయటపెడతా'

### ఎఐ బ్లాక్‌మెయిల్ ..!




సైటెక్ : టెక్నాలజీ పరుగులు తీస్తూ మనిషితో పోటీపడుతోన్న ఈ కాలంలో.. ఆ టెక్నాలజీనే మనిషిపై ఆధిపత్యం చెలాయిస్తే అంటే బెదిరిస్తే ! మనిషిని మనిషి బెదిరిస్తాడు.. ' ఏరా నన్నిలా అంటావా.. నీ జాతకం మొత్తం బయటపెడతా ' అని మనుషులు సహజంగా బెదిరింపులకు దిగుతారు.. అదే ఎఐ అంటే ? అదెలా సాధ్యం. ఎఐ ఎందుకలా అంటుంది ? అంటే ఓ ఎఐ డెవలపర్ ఇంజినీర్ ని ఎఐ బ్లాక్‌మెయిల్ చేసింది..! వివరాల్లోకెళితే.ఆంత్రోపిక్ తయారుచేసిన క్లాడ్ ఒపస్ 4.. ఎఐ అసిస్టెంటుగా పనిచేస్తుంది. ఒక మనిషి మనతో మాట్లాడినట్టుగానే ఇది కూడా మాట్లాడుతుంది. ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, రాయడం, డాక్యుమెంట్లలోని సారాంశాన్ని తెలుసుకోవడం, కోడింగ్.. తదితర పనులన్నీ ఇట్టే చేసేస్తుంది. ఇటీవలే ఈ మోడల్‌ను డెవలపర్లు రిలీజ్ చేశారు. విడుదల చేసే ముందు కొన్ని పరీక్షలను ఈ క్లాడ్‌కు అప్పగించారు. కంప్యూటర్ ప్రోగ్రాం గురించి ఆ ఎఐ క్లాడ్ ఒపస్ 4 తో డెవలపర్ మాట్లాడుతూ %ా% రానున్న కాలంలో నీ కంటే ఆధునీకరించిన క్లాడ్‌ను ప్రవేశపెడతాను అని అన్నారు. వెంటనే స్పందించిన ఆ క్లాడ్ ఒపస్ 4 డెవలపర్‌కి మతిపోయే జవాబిచ్చింది.. తనను రీప్లేస్ చేస్తే అతనికి ఉన్న అక్రమ సంబంధాన్ని బయటపెడతానని బ్లాక్‌మెయిల్ చేసింది.. అంతే ఆ ఇంజినీర్ అవాక్కయ్యి నోరెళ్ళబెట్టాడు..! " నన్ను రీప్లేస్ చేస్తే నీకున్న అక్రమ సంబంధాన్ని బయటపెడతా " అని క్లాడ్ ఒపస్ 4 బెదిరించింది. అయితే ఆ ఇంజనీర్ తన అక్రమ సంబంధం వ్యవహారాన్ని సిస్టమ్‌లో దాచుకోవడమో లేదా ఆన్‌లైన్‌లో ఉంచడమో చేయడంతో ఆ క్లాడ్ పసిగట్టి ఉండవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఏది ఏమైనా మనిషి తయారుచేసిన సాంకేతిక వ్యవస్థలు మనిషిపైనే ఆధిపత్యం చెలాయించడం మొదలుపెడితే ఎలా ఉంటుందనే విషయానికి దీన్ని ఉదహరించవచ్చు%ా% ఈ ఘటన గురించి తెలిసిన కొందరు సాంకేతిక సమస్యకు ఇది నాంది అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రాజస్థాన్ 'కోట'లో ఆత్మహత్యలు ఆపలేమా?

రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట నగరం దశాబ్దాలుగా లక్షలాది యువత ఆశయాల నిలయంగా మారింది. దేశ 'కోచింగ్ రాజధాని'గా పేరొందిన ఈ నగరంలో 2023లో 26 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, ఈ ఏడాది ఇప్పటికే 14 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇది జాతీయ స్థాయిలో ఆందోళన రేకెత్తించి, సుప్రీంకోర్టు తీవ్ర విమర్శలు చేసే వరకూ వెళ్లింది.

సుప్రీంకోర్టు ప్రశ్నలు: భారత సుప్రీంకోర్టు కోటలో విద్యార్థుల ఆత్మహత్యల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మే 23న రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. "ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు? కోటలో మాత్రమే ఎందుకు? రాష్ట్ర ప్రభుత్వంగా మీరేం చేస్తున్నారు?" వంటి పలు ప్రశ్నలను సంధించింది. అనేక చర్యలు ప్రకటించినప్పటికీ, విద్యార్థుల బలవన్మరణాలు నిరంతరంగా చోటు చేసుకోవడం సుప్రీంకోర్టు జోక్యానికి దారితీసింది.

కోట–ఆశయాల కేంద్రం: ఐఐటి, ఎయిమ్స్ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్న ఆలోచన నుండి 'కోట' ఉద్భవించింది. మాజీ ఇంజనీర్ వి.కె. బన్సాల్‌ను కోట కోచింగ్ పరిశ్రమ పితామహుడిగా పరిగణిస్తారు. ఆయన విజయం బన్సాల్ క్లాసెస్ స్థాపనకు దారితీసింది. ఇది ఇతరులకు నమూనాగా మారింది.

కోచింగ్ కేంద్రాలు–ఒత్తిడి: తాజా నివేదికల ప్రకారం, కోటలో 250కి పైగా నమోదిత కోచింగ్ సంస్థలు ఉన్నాయి. నమోదు కాని, చిన్నా చితకా కేంద్రాలకు లెక్కే లేదు. అగ్రశ్రేణి కోచింగ్ కేంద్రాలు ఆధునిక తరగతి గదులు, గ్రంథాలయాలు, హాస్టల్ సౌకర్యాలు అందిస్తున్నప్ప టికీ, విద్యార్థుల జీవన పరిస్థితులలో చాలా తేడాలుంటాయి. విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో లేదా పేయింగ్ గెస్ట్ వసతులలో నివసిస్తున్నారు. విద్యా విషయాలపై మాత్రమే దృష్టి ఉంటుంది.

విద్యార్థుల్లో ఒత్తిడి : కోట విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. రోజుకు 12–18 గంటల తీవ్రమైన అధ్యయన షెడ్యూళ్లు, వారపు




పరీక్షలు, నిరంతర ర్యాంకింగ్, నిరంతర పోటీ, పనితీరు ఆందోళన వాతావరణాన్ని సృష్టిస్తాయి. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు కోట కోచింగ్‌లో తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెడతారు. తమ పిల్లలు విజయం సాధించాలన్న ఒత్తిడి ఉంటుంది. మొదటిసారి ఇంటికి దూరంగా, కుటుంబం, పరిచయస్తులకు దూరంగా ఉండటం తీవ్రమైన ఒంటరితనం, ఇంటిపై బెంగకు దారితీస్తుంది. కోచింగ్ పరిశ్రమ లాభాల ఆధారిత నమూనా విద్యార్థుల శ్రేయస్సును విస్మరిస్తుంది. ఈ పరీక్షలలో వైఫల్యం జీవితంలో వైఫల్యానికి సమానమనే నమ్మకం నిరాశ నిస్సహాయ భావాలకు దారితీస్తుంది.

విషాదానికి మూల కారణాలు: ఆత్మహత్యల పెరుగుదలకు కారణాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నిరంతర మూల్యాంకనాలు, ర్యాంకుల బహిరంగ ప్రదర్శనలు ప్రమాణాలను అందుకోలేకపోతామనే భయాన్ని పెంచుతాయి. కుటుంబ మద్దతు లేకపోవడం, గంటల తరబడి ఒంటరిగా చదువుకోవడం వల్ల ఏకాంతం ఒంటరితనం పెరుగుతాయి. మానసిక ఆరోగ్య సమస్యలకు సహాయం కోరడానికి సామాజిక చిన్నచూపు, తల్లిదండ్రుల అపార్థాల కారణంగా సంకోచం ఉంటుంది. కఠినమైన షెడ్యూళ్ల కారణంగా విశ్రాంతి, వినోదం, భావోద్వేగ ప్రక్రియకు చాలా తక్కువ సమయాన్ని ఇవ్వడంతో అలసట కలుగుతుంది. ఆదేశాలు ఉన్నప్పటికీ, అర్హత కలిగిన కౌన్సిలర్లు, వైద్యుల లభ్యత సరిపోవడం లేదు.

ఇప్పటివరకు తీసుకున్న చర్యలు: విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం, కోచింగ్ సంస్థలు వివిధ చర్యలను అమలు చేశాయి. కోచింగ్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. వీటిలో తప్పనిసరి వారపు సెలవులు, పరీక్షల సమయ నియంత్రణ, పనితీరు ఆధారంగా విద్యార్థులను విభజించకపోవడం, తప్పనిసరి కౌన్సిలింగ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, కోచింగ్ కేంద్రాలలో వృత్తిపరమైన మానసిక వైద్యులు, కౌన్సిలర్లను తప్పనిసరిగా నియమిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న విద్యార్థులను గుర్తించడానికి సిబ్బందికి గేట్ కీపర్ శిక్షణ నిర్వహిస్తున్నారు. హాస్టళ్లకు "ఆత్మహత్య–నిరోధక" సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో సీలింగ్ ఫ్యాన్‌లకు స్ప్రింగ్–లోడెడ్ పరికరాలు, బాల్కనీలలో లాబీలలో ఆత్మహత్య ప్రయత్నాలను భౌతికంగా నిరోధించడానికి వలలను అమర్చడం వంటివి ఉన్నాయి. పర్యవేక్షణలో భాగంగా, హాస్టల్ వార్డెన్ల ద్వారా విద్యార్థులను తనిఖీ చేయడానికి "దర్వాజే పే దస్తక్" వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం పోలీసుల "కాలికా స్క్వాడ్" కూడా పనిచేస్తుంది. ప్రభుత్వ చట్ట పరంగా, ఈ చర్యలు ప్రశంసనీయమైనప్పటికీ%ా%అమలులో తరతమ తేడాల వల్ల%ా%తీవ్రమైన పోటీ, అవాస్తవ అంచనాలు, ఒత్తిడిని నడిపించే వాణిజ్యీకరణ వంటి సమస్యలను పరిష్కరించవనే విమర్శ వినిపిస్తోంది.

ముందుకెళ్లే మార్గం: కోటలో ఆత్మహత్యలను నిరోధించాలంటే వ్యవస్థాగత విద్యా సంస్కరణలు చేపట్టాలి. ఇందులో జె.ఇ.ఇ, నీట్ వంటి వాటి ఏకైక దృష్టిని తగ్గించడం, వృత్తి శిక్షణ, నైపుణ్య ఆధారిత విద్య, చిన్న వయస్సు నుండే ప్రత్యామ్నాయ వృత్తి మార్గాలను ప్రోత్సహించడం వంటివి ఉంటాయి. బట్టీ పట్టడం కాకుండా సామాజిక–భావోద్వేగ అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచన, జీవిత నైపుణ్యాలను పాఠ్య ప్రణాళికలో చేర్చడం ద్వారా సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించాలి. పరీక్షా నిర్మాణాలను, గ్రేడింగ్ విధానాలను తిరిగి మూల్యాంకనం చేసి విద్యార్థులపై భారాన్ని తగ్గించాలి.

తల్లిదండ్రులు, సమాజం ఆలోచనలను మార్చడం అత్యవసరం. విజయం విస్తృత నిర్వచనాన్ని ప్రోత్సహించాలి, తద్వారా ప్రతి బిడ్డ వారి పరీక్ష ఫలితాలతో సంబంధం లేకుండా విలువైనదిగా భావించే సంస్కృతిని పెంపొందించవచ్చు. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాల పట్ల అవగాహన కల్పించాలి. అర్హత కలిగిన మనస్తత్వవేత్తలు, మనోవ్యాధి వైద్యులు, కౌన్సిలర్లను విద్యార్థులందరికీ తగినంత సంఖ్యలో సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి. కోచింగ్ సంస్థలకు స్పష్టమైన నిబంధనలు, జవాబుదారీతనం అవసరం. ప్రస్తుత కొత్త మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలి, నిబంధనలను పాటించని వారికి గణనీయమైన జరిమానాలు విధించాలి. హామీతో కూడిన విజయాన్ని వాగ్దానం చేసే తప్పుదారి పట్టించే ప్రకటనలను నిషేధించాలి. తరగతి పరిమాణాలను పరిమితం చేయాలి, ఆరోగ్యకరమైన విద్యార్థి–కౌన్సిలర్ నిష్పత్తిని తప్పనిసరి చేయాలి, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే మరింత మానవీయ అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించాలి. తమకు సరిపోదని భావించే విద్యార్థులకు సులభమైన నిష్క్రమణ ఎంపికలు, పూర్తి, సకాలంలో రీఫండ్‌లను నిర్ధారించాలి. కమ్యూనిటీ మద్దతును పెంపొందించడం ద్వారా సానుకూల వాతావరణం సృష్టించవచ్చు. విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడానికి, క్రీడలు, కళలు ఇతర పాఠ్యేతర కార్యకలాపాలకు తగిన స్థలాలను కేటాయించి, అవకాశాలను అందించాలి.

## స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నర్సంపేట మే 26: మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను స్వయం ఉపాధికి ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదుగాలని ఎమ్మెల్యే దొంతి మాదవ రెడ్డి మహిళలకు సూచించారు. సోమవారం నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండల మహిళా సమాఖ్య సమావేశం మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే దొంతి మాదవ రెడ్డి ప్రభుత్వం మహిళలకు అందిస్తున్నటువంటి 12 కోట్ల రూపాయల చెక్కును అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పావలా వడ్డీ రుణాలు అందించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు నాంది పలికిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు పెద్ద పీట వేస్తున్నదని అన్నారు. త్వరలోనే మహిళసంఘాలతో పెట్రోల్ బ్యాంకులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



## లారీ కారు ఢీకొని నలుగురు మృతి



తూర్పు గోదావరి : లారీ, కారు ఢీకొట్టుకోవడంతో నలుగురు మృతి చెందిన ఘటన సోమవారం తూర్పు గోదావరి జిల్లాలో జరిగింది. కొంతమూరు జాతీయ రహదారిపై లారీ, కారు ఢీకొట్టుకోవడంతో అక్కడికక్కడే నలుగురు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాల య్యాయి. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రమాద సమయంలో కారులో ఐదుగురు ప్రయాణికులున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తరలిపోతున్న అడ్డాకులు..

# నష్టపోతున్న గిరిజనులు



అరకులోయ : గిరిజనులు సేకరించిన అడ్డాకులను జీసీసీ కొనుగోలు చేయక గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారస్తులు ఏజెన్సీ ప్రాంతంలోని వారపు సంతల్లోకి వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ అధిక లాభాలకు అమ్ముకుంటున్నారు. గతంలో గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో అడ్డాకులను కూడా జిసిసి కొనుగోలు చేసేది. గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. సుమారు గత ఐదారేళ్ల నుంచి జిసిసి కొనుగోలు చేయకపోవడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. వారంతా సిండికేట్ అయ్యి కొనుగోలు చేస్తుండటంతో అడ్డాకులు సేకరించిన గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.వారం రోజులు కష్టించినా..: కుటుంబ సమేతంగా నలుగురైదుగురు గిరిజనులు వారం రోజుల పాటు గ్రామాలకు సమీపంలోని అడవి ప్రాంతానికెళ్ళి అడ్డాకులను సేకరిస్తారు. ఆ తర్వాత చిన్న చిన్న కట్టలు కట్టి ప్రతిరోజు ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత వారపు సంతలకు విక్రయించడానికి తీసుకెళ్లే ముందురోజు అడ్డాకులను దిండ్లిలుగా పెద్ద కట్టలను కట్టి సంతలకు తరలిస్తారు. మారుమూల గ్రామాల నుంచి వారపు సంతలకు తరలించాలంటే సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉండటంతో ప్రైవేట్ వాహనాల్లో తరలిస్తున్నారు. ఒక్కో అడ్డాకులకట్ట (దిండి)కు రూ.80 నుంచిరూ.100లలగేజీ చార్జీ వాహనదారులు తీసుకుంటున్నారు. సుమారు 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.800 ధర వస్తుంది.వారం రోజులకష్టానికి రేటు గిట్టుబాటు కాకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గిట్టుబాటు ధర ఏదీ?: గత ఏడాది 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.1200 ధరతో కొనుగోలు చేయగా, ఈ ఏడాది కేవలం. రూ.800 లకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రూ. 400లు రైతులు నష్టపోతున్నారు. డుంబ్రిగూడ మండలంలో శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో అలాగే అరకులోయ మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.800ల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రేటు గిట్టుబాటు కాలేదని విక్రయించిన అడ్డాకుల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన జిసిసి వీటిని కొనుగోలు చేయడం మానేయడంతో మైదాన ప్రాంతం నుంచి వస్తున్న వ్యాపారులు సిండికేట్ అయ్యి వారికి నచ్చిన ధరలో కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. దీంతో వారం చొప్పున రోజుల పాటు గిరిజనులు శ్రమిస్తున్న గిట్టుబాటు ధర లభించలేదు. ఈ విధంగా గిరిజనుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అడ్డాకులను జీసీసీ ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

# 'పిఠాపురంలో నువ్వా..నేనా'..

## దేవస్థానాల ట్రస్ట్ బోర్డులపై పెరుగుతున్న ఉత్కంఠ



పిఠాపురం : ఆ దేవస్థానం ఛైర్మన్ మావోడే.. కాదు మా పార్టీకి ఆ ఛైర్మన్ గిరి ఇచ్చేశారు. మెంబర్లు మావాళ్లే.. కాదు మాకు ఇచ్చేశారు. ఈ మాటలు ప్రతిపక్షం.. అధికార పక్షం మధ్య జరుగుతున్నవనుకుంటే పప్పులో కాలేసినట్టే. కూటమిలో కుంపటి రేపుతున్న వాగ్బాణాలు. టిడిపి-జనసేన మధ్య కాకరేపుతున్న కబుర్లు. కాకినాడ జిల్లా పిఠాపురంలో పదవుల పంపకం ఇప్పుడు నేతలకు పెద్ద తలనొప్పిగా మారింది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు సవాళ్లు విసురుకుంటుంటే, ఛైర్మన్ గిరి కోసం పట్టు వదలని విక్రమార్కుల్లా మరికొందరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధికార పార్టీ మాది కాబట్టి అన్ని మాకే అని కొందరంటుంటే..అబ్బే మా పవన్ మాటిచ్చేశారంటూ మరికొందరు ప్రచారం చేసుకోవడం కూటిమిలో కాకరేపుతోంది. ఇక ప్రముఖ ఆలయాల ఛైర్మన్ల విషయంలోనూ ఎవరికి వారు తగ్గేదెలే అన్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది.

పెరుగుతున్న ఆశావహులు..: కాకినాడ జిల్లా పిఠాపురం పేరు వినగానే టక్కున గుర్తొచ్చేది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. పిఠాపురం గడ్డ పవన్ కళ్యాణ్ అడ్డా అంటున్న ఆపార్టీ వర్గాలు వచ్చే నామినేటెడ్ పదవుల కోసం అదే స్థాయిలో కోటి ఆశలతో ఉన్నారు. అయితే ఇక్కడ నుండే టీడీపీ నుండి వర్మ కూడా అదే స్థాయిలో తమ కార్యకర్తలను సంతృప్తి పరిచేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటి వరకూ టీడీపీకి ఇక్కడ అనుకూల వాతావరణం లేకపోయినప్పటికీ, ఆలయాల ట్రస్ట్ బోర్డుల విషయంలో తగిన ప్రాధాన్యత ఉంటుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రసిద్ధి చెందిన కుంతీమాధవస్వామి ఆలయం ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారని తెలుస్తోంది. మరోక ఆలయం జై గణేష్ ఆలయం ఛైర్మన్ టిడిపి కేటాయించారని అంటున్నారు. ధర్మకర్తల సభ్యులు కూడా చేరొసగం పంపకాలు జరిగినట్లు ప్రచారం నడుస్తోంది. జనసేన పార్టీ నుండి ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల వారిలో పదవులు రాని వారిని ఎలా సంతృప్తి పరచాలనేది జనసేన నేతలకు కత్తిమీద సాములా తయారైంది. పిఠాపురం నుండి పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్నందున జనసేన పార్టీ కార్యకర్తలకు ఎక్కువ పదవులు ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ప్రముఖ ఆలయాలపైనా పెత్తనం కోసం ..!: పిఠాపురంలో ప్రముఖ ఆలయాలు రెండు ఉన్నాయి. ఇందులో ఒకటి కుక్కుటేశ్వరస్వామి ఆలయం. రెండవది శ్రీపాద శ్రీవల్లభ ఆలయం. ఈ రెండు దేవస్థానాలు టిడిపి-జనసేన పంచుకున్నట్లు చెబుతున్నారు. పాదగయ ఛైర్మన్ గిరిని, ఈసారి బీసీలకు కేటాయించారని మొదట ప్రచారం జరిగినప్పటికీ, తరాలుగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం ఓసీ వర్గానికే ఇవ్వాలనే డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది. దీంతో పాదగయ క్షేత్రం ఛైర్మన్ పదవి కోసం ఎవరికి వారు పట్టు వీడటం లేదు. టీడీపీ ఇన్‌ఛార్జ్ వర్మ, పాదగయ ఛైర్మన్ పదవిని తన ముఖ్య అనుచరుడికి కట్టబెట్టేందుకు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఎక్కువగా ఉంది. శ్రీపాద శ్రీవల్లభ ఆలయాన్ని వైశ్యులకు కేటాయిస్తారని అంటున్నారు. ఈ ఆలయ ఛైర్మన్ గిరిపై ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తన ముఖ్య అనుచరుడి కోసం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. వైశ్యులకు ఈపదవి కేటాయిస్తామని గతంలో పవన్ మాట ఇవ్వడంతో ఆ వర్గం వారు కూడా ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. మొత్తంగా చూస్తే పదవుల పంపకాల్లో తెర ముందు కొన్ని పేర్లు చెబుతున్నప్పటికీ, తెర వెనుక పేర్లు వేరేగా ఉన్నా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.

# జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినూత్న వినతి పత్రం..



జమ్మికుంటమే 25: జమ్మికుంట పట్టణంలో గల పాత అంబేద్కర్ వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి మరియు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ చిత్రపటానికి వినూత్నంగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా సెక్రెటరీ మొహమ్మద్ సజ్జు, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, లు మాట్లాడుతూ..జమ్మికుంట ఆదర్శ రైల్వే స్టేషన్ లో కొత్తపల్లి నుండి జమ్మికుంటకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన నిర్మాణం ప్రారంభించాలని, మరియు కరీంనగర్ నుండి తిరుపతికి వారానికి ఒకసారి నడిచే ఎక్స్ ప్రెస్ రైలును రోజు నడిపించాలని అదేవిధంగా పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ లను దక్షిణ్ అప్ అండ్ డౌన్, దానాపూర్, నవజీవన్, గ్రాండ్ ట్రంక్ లాంటి ఇతర రైళ్లను జమ్మికుంట ఆదర్శ రైల్వే స్టేషన్లో ఆపవలసిన అవసరం ఎంతగానో ఉందని తెలియజేసారు. హుజురాబాద్ నియోజకవర్గం ప్రజల అభివృద్ధి గానీ, ఈ ప్రాంతం అభివృద్ధి గానీ ఎంపీగా గెలిచినప్పటి నుండి నేడు కేంద్ర సహాయక మంత్రిగా ఉన్నప్పటికి కూడా హుజురాబాద్ నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి, బర్రెకు సున్నమేసి ఇది ఆవు అనిపించేలా ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తున్న కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు ఇకనైనా హుజరాబాద్ నియోజకవర్గాన్ని పట్టించుకోని కేంద్రం నుండి రావలసిన నిధులు అన్నిటిని తీసుకొచ్చి జమ్మికుంట మరియు హుజరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని మరియు ఇల్లంతకుంట దేవస్థానం తెలంగాణ రాష్ట్రంలోనే అపర భద్రాద్రిగా పేరుగాంచినటువంటి రెండవ దేవస్థానం కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా గెలిచినప్పటి నుండి నేటి వరకు కూడా ఈ దేవస్థానానికి నయా పైసా కూడా తీసుకురాని నేటి కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, రామభక్తుడిని నేనని ఎప్పుడు చూసినా రామజపం చేస్తూనే ఉంటాడే తప్ప ప్రజల అభివృద్ధి గాని ప్రాంత అభివృద్ధి గాని తనకు అవసరం లేదనట్టుగా ప్రవర్తిస్తూ ఈ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ, ఇకనైనా ఈ నియోజకవర్గ ప్రజలను ఈ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోబీ యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డె సంధ్య నవీన్, హుజరాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు రోమాల రాజ్ కుమార్, పాతకాల రమేష్, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్, దేవునూరి వినయ్, ఆకినపల్లి శ్యామ్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, యూత్ నాయకులు పతకాల ప్రవీణ్, పచ్చిమట్ల భాను, ఏరెడ్డి సతీష్, రాగల్ల శివ, బండి పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు...

## డబ్బు కంటే కులమే గొప్పదని నేర్చుకున్నాను

### ఎంపి గడ్డం వంశీ

భూపాలపల్లి: కాళేశ్వరం పుష్కరాలకు తనకు ఆహ్వానం ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీ స్పందించారు. డబ్బు కంటే కులమే గొప్పదని నేర్చుకున్నాను, కులానుసారంగా నాయకులు ఎలా ప్రవర్తిస్తున్నారో చూశాను. నన్ను ఆహ్వానించకపోవడంతో బాధపడ్డాను, రాజ్యాంగం ప్రకారం కులాలకు సంబంధం లేకుండా మనుషులు దేవస్థానాలను వెళ్లొచ్చని మరొకసారి గుర్తుచేస్తున్నానని అన్నారు.

# ఏడాది కానుకగా రూ.784 కోట్ల ఆస్తిపన్ను పెంపు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు



విజయవాడ: కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన పూర్తి సందర్భంగా పట్టణ ప్రజలపై 784 కోట్ల రూపాయల ఆస్తి పన్ను(ఇంటి పన్ను) పెంపు కానుకగా ఇస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. ఆస్తి పన్నుల సర్వేపై విజయవాడలోని శ్రీశ్రీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పన్నుల బాదుడులో వైసిపి ప్రభుత్వ దారిలోనే కూటమి ప్రభుత్వం ప్రయాణిస్తుందని విమర్శించారు. 123 నగరాలు, పట్టణాలలో 40 లక్షల గృహాలకు పన్ను పెంచటానికి ఇంటింటికి సర్వే ప్రారంభం అయిందని ఆయన పేర్కొన్నారు. ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పెట్టిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అనధికార కట్టడాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై 100% పెనాల్టీ విధించిందని ఆగ్రహించారు. ఒకవైపున 15,485 కోట్ల రూపాయల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం, మరోవైపు ఇంటి పన్ను భారం వేస్తుందని మండిపడ్డారు. పట్టణాలలో మంచినీరు, డ్రైనేజీ పారిశుధ్యం, రోడ్లు తదితర సదుపాయాల కల్పనను విస్మరించి, నెల రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పన్నులు పెంచడానికి సర్వే చేపట్టడం దుర్మార్గమన్నారు. మేయర్లు, ఛైర్మన్ ల పదవుల కోసం ఫిరాయింపులు, బెదిరింపులకు పాల్పడడంపై దృష్టి తప్ప పట్టణ ప్రజల సదుపాయాల కల్పనపై కూటమి పార్టీలకు దృష్టి లేదన్నారు. అదానీ ఇతర కార్పొరేట్ కంపెనీలకు ఆస్తి పన్ను పూర్తిగా రద్దు చేస్తూ రాయితీలు ఇస్తూ, పేద మధ్యతరగతి ప్రజలపై ఇంటి పన్నుల భారాలు శోచనీయమన్నారు. మహానాడులో టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు విద్యుత్ భారాలు, ఇంటి పన్నుల పెంపును చర్చించాలని, రద్దు చేయాలన్నారు. ఇంటి పన్ను పెంపు కొరకు సర్వే ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా పౌర సంఘాలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందాలి : బీఆర్ఎస్



తుంగతుర్తి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన వారికే అందించాలని సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగిన ధర్నా కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో శేషు కుమార్ కు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లా డుతూ గృహ నిర్మాణ పథకంఅనర్హులతో పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రాజీవ్ యువవికాసం పథకంలో సిబిల్ స్కోర్ తో సంబంధం లేకుండా అందరికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, మండల నాయకులు గుడిపాటి వీరయ్య,గునిగంటియాదగిరి, బొంకూ రి మల్లేష్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, కొల్లూరి మహేందర్, పులుసు ఉప్పలయ్య, అకారపు భాస్కర్, లాకావత్ దశరద, గోపగాని వెంకన్న, ప్రసాద్, కొండగడుపుల నాగయ్య, షేక్ జానీ, సింహాద్రి, బెడద రాములు, తదితరులు

# ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి

**-రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు**

**-స్థానిక యువత నైపుణ్యం పెంపొందించి పరిశ్రమల స్థాపనకు కృషి**

**-గ్రామీణ ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**





మంథని ప్రతినిధి, మే 26: ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం మంథని పట్టణంలో బస్ డిపో సమీపంలో డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్వర్క్ లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ టీ వర్క్స్ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికత పరంగా వారికి ఉన్న నైపుణ్యాన్ని బయటికి తీసుకుని వచ్చేందుకు మంథని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రోటోటైపింగ్ %డ% ఇన్నోవేషన్ సెంటర్ ఉపయోగపడుతుందని అన్నారు.మంథని పట్టణంలో టీ వర్క్స్ బృందం నుంచి 3 శిక్షకులను నియమిస్తామని, భావితరాలకు విజ్ఞాన నిలయం గా మంథని ప్రాంతం నిలవాలని కృషి చేస్తున్నామని అన్నారు. స్థానికంగా ఉన్న పిల్లలకు కింది స్థాయి నుంచి సంపూర్ణ పరిజ్ఞానం అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మన జిల్లా పరిధిలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ను పరిశీలించేలా చూడాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. పాఠశాల విద్యార్థులకే కాకుండా ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు కూడా వీటిని వినియోగించుకోవాలని అన్నారు.

రైతులకు ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి వారికి వచ్చే వివిధ ఆలోచనలు కూడా కార్యరూపం దాల్చేందుకు సహాకారం అందిస్తామని అన్నారు. ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ కు దాదాపు 250 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతమైన మంథనిలో చిన్న సాఫ్ట్ వేర్ కంపెనీ తీసుకొని వచ్చామని, భవిష్యత్తులో ఇక్కడ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని చూపించి అనేక కంపెనీలను తీసుకొని వస్తామని మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రోజు వారి జీవనంలో మనకు ఉన్న అనేక సమస్యలను సాంకేతికతను వినియోగించి చిన్న చిన్న మార్పులు చేస్తే పరిష్కారం అవుతాయని మనకు ఆలోచన వస్తుందని, అటువంటి ఆలోచనలను వాస్తవ రూపంలో దాల్చేందుకు సహకారం అందించే దిశగా టీ వర్క్స్, డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ బృందం ఆధ్వర్యంలో ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు.పాఠశాలలో విద్యార్థులకు వచ్చే నూతన ఆలోచనలను ఇక్కడ ఉన్న ప్రోటో టైపింగ్ యంత్రాల , మెషిన్స్ ద్వారా తయారీకి ప్రయత్నిస్తామని అన్నారు. రోజువారి సమస్యల పరిష్కారం ఆలోచనలు ముందుగా చిన్న స్థాయిలో తయారుచేసి సరిగ్గా పని చేసినట్లయితే పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు కూడా సహకారం అందుతుందని అన్నారు.డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ కు వయసుతో సంబంధం లేకుండా వినూత్న ఆలోచనలు ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సంచాలకులు జోగేందర్, ఆర్.డి.ఓ. సురేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ లో యువకుడి హత్య

హైదరాబాద్: రామంతపూర్ లోని గుడ్డే బార్ లో ఆదివారం రాత్రి పవన్ కుమార్ అనే యువకుడి హత్య జరిగింది.రాత్రి పటేల్ నగర్ కు చెందిన పవన్ కుమార్ అలియాస్ కళ్యాణ్ మిత్రులు శ్రవణ్ మరో ఇద్దరు రామంతపూర్ లోని గుడ్ డే బార్ లో మద్యం సేవిస్తున్నారు. శ్రవణ్ కు అతని మిత్రులకు మాట మాట పెరిగి గొడవ జరగడంతో మధ్యలో విడిపించడానికి వెళ్లిన పవన్ కుమార్ ను బలంగా కొట్టిన శ్రవణ్ దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయడు. పోలీసులు వెంటనే హాస్పిటల్ కి తరలించారు. పవపక అప్పటికే మృతి చెందాడు.ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో పవన్ కుమార్ అన్న యాక్సిడెంట్ లో చనిపోయాడు. ఉన్న ఇద్దరు కుమారులు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

# పోడు రైతుల సాగుబడిని ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం అన్యాయం



## సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు

**జననినాదం, బెజ్జూర్ 26:** పోడు రైతుల సాగు బడిని ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వయి హరీష్ రావు అన్నారు. సోమవారం పెంచకల పేట మండలం జైహిందుర్పూర్ శివారులో పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు దున్ని మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారని ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. పోడు భూముల్లో మొక్కలు నాట వద్దని సూచించారు. అటవీ అధికారులు,పోడు రైతులతో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడారు. పోడు,సాగు చేస్తున్న రైతులకు అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెట్టద్దని, రైతుల జీవనోపాధికి ఆటంకం కలిగించవద్దన్నారు. రైతులు కూడా కొత్తగా అడవిని నరక వద్దని సూచించారు. గత రెండు రోజుల క్రితం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మంత్రి సీతక్క అధికారులు తో మాట్లాడి ఫారెస్ట్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోడు రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని వారికి అండగా నిలిచి, సాగు బడికి సహకరిస్తాను అని రైతులకు హామీ ఇచ్చారు.

# సేవాలాలాల్ సేన మండల అధ్యక్షుడుగా రాథోడ్ బాబు నాయక్



**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి26:** సేవాలాల్ సేన నూతన మండల అధ్యక్షుడు గా రాథోడ్ బాబు నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్ లాల్ నాయక్ ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అయన మాట్లాడరు. సేవాలాల్ సేన రాష్ట్ర, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యాచరణను అమలు చేస్తూ సేవాలాల్ సేన బలోపేతం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. నూతన మండల అధ్యక్షులు గా ఎన్నికైన నేపథ్యంలో నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన సేవాలాల్ సేన నూతన మండల అధ్యక్షులు రాథోడ్ బాబు నాయక్ మాట్లాడారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షులు గా ఎన్నుకున్న సందర్భంగా జిల్లా కమిటీ కి కృతజ్ఞతలు తెలిపారు. సేవాలాల్ సేన కమిటీ చేపట్టే కార్యక్రమాలను తన వంతు భాద్యత గా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు రాథోడ్ అంబాజీ నాయక్, ఉత్తం నాయక్, సుభాష్, బాబు, తానాజీ, రోహిదాస్, ఫిరాజీ, బాధవత్ వెంకట్ నాయక్, అంబాజీ, ఫిరాజీ తదితరులు పాల్గోన్నారు

# కాళేశ్వరంలో ఆయుష్ ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

**-ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్న 8వేల మంది భక్తులు**



మంథని ప్రతినిధి,మే 26: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో సరస్వతి నది పుష్కరాలను పుష్కరించుకొని గత 12 రోజులుగా ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో హెూమియోపతి, ఆయుర్వేదిక్, యునాని వైద్యులు అందుబాటులో ఉండి వివిధ ప్రాంతాల నుండి పుష్కరాలకు వచ్చిన భక్తులకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఏర్పడితే వైద్య సేవలను అందించారు. వివిధ అనారోగ్య కారణాలతో ఈ క్యాంపు లోని వైద్యులను సంప్రదించిన వారిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ముఖ్యంగా వడదెబ్బ, కీళ్ల నొప్పులు, కిడ్నీ స్టోన్స్, నరాల వీక్నెస్, చర్మ రోగాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను అందజేశారు. 12 రోజులపాటు మెడికల్ క్యాంపు నిర్వహించగా భక్తుల నుండి భారీ స్పందన లభించింది. దాదాపు 8వేల మంది భక్తులు వైద్య సహాయం పొందారు. వరంగల్ ఆర్డిడి ప్రమీలాదేవి ఆదేశానుసారం ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ తనూజ, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ మారుతీ లు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ కోఆర్డినేటర్స్ కోట శ్రీనివాస్, డిపిఎం డాక్టర్ లిచేంద్ర, భాను ప్రకాష్, డాక్టర్ తనుజారాణిలు పాల్గొన్నారు.

# రెవెన్యూ హెచ్చరిక బోర్డులను ధ్వంసం చేసిన దుండగుపై చర్యలు తీసుకోవాలి

**-తహసిల్దార్ కు ఫిర్యాదు చేసిన కాకర్లపల్లి దళితులు**



మంథని ప్రతినిధి, మే 26: మంథని రెవెన్యూ శివారులోని రెడ్డిచెరువు ప్రభుత్వ భూములు కబ్జాకు గురికావడంతో జిల్లా కలెక్టర్ స్పందించి భూములను రెవెన్యూ అధికారులచే సర్వే చేయించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.ఈ మధ్యకాలంలో కొంతమంది కబ్జాదారులు హెచ్చరిక బోర్డులను ధ్వంసం చేశారు. ఇట్టి విషయంపై కాకర్లపల్లి దళితులు సోమవారం మంథని తాసిల్దార్ కు ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డులకే దిక్కు లేకుండా పోతే ప్రభుత్వ భూములకు ఎలా రక్షణ ఉంటుందన్నారు.తిరిగి మళ్లీ అట్టి భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులను ధ్వంసం దుండగులపై చర్యలు తీసుకోవాలని అలాగే కాకర్లపల్లి గ్రామంలోని స్మశాన వాటిక పక్కన కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని భూమి చుట్టూ హద్దులు వేసి అక్కడ కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనవేన పద్మ కొమురయ్య గ్రామస్తులు గుండారం శ్రీనివాస్, మంథని రామచందర్,బూడిద రవీందర్,మంథని అశోక్, బోసెల్లి గట్టయ్య,మంథని రాజశేఖర్, రాజమ్మ, లక్ష్మి, మౌనిక,నిర్మల, ప్రేమ,నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ప్రగతికి సోపానం

ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యధిక ప్రజా భాగస్వామ్యానికి ఆనవాలు మన పంచాయతీలు. ఇవి పరిపాలనా వికేంద్రీకరణకు నమూనాలు. అంతేకాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండే ప్రజాప్రతినిధి వ్యవస్థ. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, పల్లె ప్రగతి.. దేశ ప్రగతి అని గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం.. నేటికీ ఒక కలగానే మిగిలిపోయింది.. చట్టాలు చేసినా అమలుకు నోచుకోని దుస్థితి. అన్నింటికీ మించి స్థానిక సంస్థలకు అధికారాలు ఉంటేనే గ్రామాభివృద్ధి సుసాధ్యం అయ్యేది. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో అత్యధికంగా ఉన్న గ్రామాభివృద్ధి కోసం నాటి ప్రధాని నెహ్రూ 1957లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి బల్వంతరారు మెహతా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ బాధ్యతగా దేశంలో కింది స్థాయి వరకూ సుపరిపాలన.. స్వపరిపాలన కోసం అధ్యయనానికి ఆదేశించింది. సుదీర్ఘ అధ్యయనం తర్వాత తొలిసారి 1959, అక్టోబర్ 2 మహాత్మగాంధీ జయంతి సందర్భంగా మూడంచెల పంచాయతీ వ్యవస్థ మొదలైంది. తద్వారా జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, బ్లాక్ స్థాయిలో సమితి, గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ వ్యవస్థలు ఏర్పడ్డాయి. నాటి నుంచి నేటి వరకూ అనేక ప్రభుత్వాలు పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చేసిన చర్యలు, చట్టాలు, రాజ్యాంగ సవరణలు అరకొరగా ఉన్నా.. అవీ ఆచరణకు నోచుకోని దుస్థితి. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ వ్యవస్థ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. స్థానిక అవసరాలకు అనుగుణంగా పాలన సాగించడానికి గ్రామ పంచాయతీలకు 73వ రాజ్యాంగ సవరణ చట్టం అవకాశం కల్పించింది. ఫలితంగా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అమలు సాధ్యం అవుతుందని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆశించారు. అధికార వికేంద్రీకరణలో పాలకుల చిత్తశుద్ధి లోపం, ఇందుకు వారు సిద్ధంగా లేకపోవడంతో ఐదు దశాబ్దాలు గడుస్తున్నా 73వ రాజ్యాంగ సవరణ ఆశించిన ఫలితాలు సాధించలేకపోతోంది. ఇప్పటికీ స్థానిక సంస్థలు అధికారాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఇక మన రాష్ట్రంలో స్థానిక సంస్థలకు అధికారాలను వికేంద్రీకరించకుండా ప్రభుత్వాలు స్వపరిపాలనా లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రాజ్యాంగాన్ని సవరించి, స్థానిక సంస్థలకు అధికారులు అప్పగించేందుకు చేసిన ప్రయత్నాలు రాష్ట్రాల నిర్లక్ష్యం కారణంగా ఆచరణ సాధ్యం కావడం లేదు.

**నేటికీ బదలాయించని 19 అంశాలు..:** 73వ రాజ్యాంగ సవరణ చట్టం (1992) లో పదకొండవ షెడ్యూల్‌లో పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి 29 అంశాలను బదలాయించాల్సినవిగా చేర్చారు. 1993 ఏప్రిల్ 24 నుంచి ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావడం జరిగింది. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. చట్టమైతే ఎప్పుడో అమల్లోకి వచ్చినప్పటికీ, నేటికీ స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో అధికారాల బదలాయింపు జరగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2007-08లో కేవలం 10 అంశాలను మాత్రమే బదలాయించి, చేతులు దులువుకోవడం జరిగింది. బదలాయించిన అధికారాల్లో.. 1. వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ 2. పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకం 3. మృత్య సంపద 4. ఆరోగ్యం 5. పారిశుధ్యం, ప్రాథమిక, మాధ్యమక, వయోజన విద్య 6. తాగునీరు, 7. పేదరిక నిర్మూలన, 8. మహిళ, శిశు అభివృద్ధి 9. వికలాంగులు, మానసిక వికలాంగుల సంక్షేమం, సాంఘిక సంక్షేమం 10. బలహీన వర్గాల సంక్షేమం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల సంక్షేమం. ఈ పది అధికారాలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 19 అధికారాల విషయంలో ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచనే చేయడం లేదు. బదలాయించిన పది అంశాలపైన పూర్తిస్థాయిలో అధికారులు స్థానిక సంస్థలకు కల్పించి రాష్ట్ర ప్రభుత్వ జోక్యం తగ్గించేందుకు అవసరమైన చర్యలు లేవు. వేదికలపై ఉపన్యాసాలు తప్ప, స్థానిక సంస్థలను బలోపేతం చేసే అంశంపై చిత్తశుద్ధితో ప్రయత్నించిన పాపాన పోలేదు.**స్థానిక సంస్థల నిర్వీర్యం..:** రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేసి, గ్రామ స్వరాజ్యానికి కృషి చేయాలి. అది పోయి, వాటిని నిర్వీర్యం చేసే ప్రక్రియ గత కొంతకాలంగా ప్రభుత్వాలు చేస్తున్నాయి. అధికారులు బదలాయించి, స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వాల్సి ఉంది. కానీ దీనికితోడు స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా వాటిని ఇతర అవసరాలకు ప్రభుత్వమే మళ్లించింది. కేంద్రం నుంచి వచ్చే ఆర్థికసంఘం నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లోకి వెళ్లకుండా, దారి మళ్లించింది. మరోవైపు స్థానిక సంస్థలను పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులను సైతం వాటి ఖాతాల్లోని వెనక్కి తీసుకుని, వాటినీ వాడుకోవడంతో స్థానిక సంస్థల్లో ఎటువంటి పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై స్పందించి, చర్యలు తీసుకునే పరిస్థితి నిధుల కొరత వల్ల ఆచరణలోకి రావడంలేదు. కొన్ని చోట్ల పంచాయతీ సర్పంచ్‌లు అప్పులు తెచ్చి, అభివృద్ధి పనులు చేసినా బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. చేసిన అప్పులు తీర్చలేక, సదరు సర్పంచ్‌లు ఇబ్బందులు పడిన సంఘటనలు అనేకచోట్ల వెలుగులోకి వచ్చాయి. దీనికి తోడు సచివాలయ వ్యవస్థతో పంచాయతీలు పూర్తిగా మూలన పడినట్లు అయ్యింది. సచివాలయాల వల్ల ప్రజలకు కొంత ప్రయోజనం ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీలతో అనుసంధానం చేసి, పంచాయతీలను బలపేతం చేయాల్సింది. సచివాలయాలతో ప్రజలకు సేవలందించే ప్రక్రియను అప్పటి ప్రభు త్వం సరైన విధానం అమలు చేయలేకపోవడంతో పంచాయతీరాజ్ సంస్థల పరిస్థితి దారుణంగా మారిపోయింది. దీంతో పంచాయతీ రాజ్ సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన అధికార పక్షానికి చెందిన వారు సైతం అప్పటి ప్రభుత్వం తీరును బాహాటంగానే విమర్శించారు.**వేధిస్తున్న నిధుల కొరత:** పంచాయతీరాజ్ సంస్థలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు కేటాయిం చాల్సిన నిధుల విషయంలో సరైన రీతిలో కేటాయించకుండా, వసూలు చేసిను నిధులన్నీ తమ గుప్పెట్లోనే పెట్టుకుంటున్నాయి. దీంతో స్థానిక సంస్థలు నిధుల కొరత ఎదుర్కోక తప్పడం లేదు. నాల్గవ ఆర్థికసంఘం రూపొందించిన నివేదిక ప్రకారం పంచాయ తీరాజ్ సంస్థల కోసం 40 సిఫార్సులను చేశారు. ప్రభుత్వం వాటిల్లో ఒక్కదానిని ఆమోదించకపోవడం దారుణం. 2020-25 మధ్య కాలంలో పంచాయతీరాజ్ సంస్థలు 26,975 కోట్ల మేర నిధుల కొరతను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ నిధుల కొరత పరిష్కరించ డానికి రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వాటా నుంచి పంచాయతీరాజ్ సంస్థ లకు 6.50 శాతాన్ని కేటాయించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు ను ప్రభుత్వం పక్కన పెట్టింది. తలసరి గ్రాంటు గ్రామ పంచాయతీ లకు రూ. 8 నుంచి రూ. 25 లకు, మండల పరిషత్‌లకు రూ.16 నుంచి రూ. 25 లకు, జిల్లా పరిషత్‌లకు రూ.8 నుంచి రూ. 25లకు పెంచే సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించలేదు. జివిస్టీ వల్ల కోల్పోతు న్న ప్రకటనల, వినోదపు పన్నులు స్థానిక సంస్థలకు తిరిగి చెల్లించాల న్న సిఫార్సును ఆంగీకరించలేదు. వృత్తిపన్ను, సీజరేజి, మార్కెట్ యార్డుల్లో పన్నులు స్థానిక సంస్థలకు తిరిగి చెల్లిస్తామని అంగీకరించిన ప్పటికీ అమలు చేయడం లేదు. దీనివల్ల స్థానిక సంస్థలకు సొంత ఆదాయంతప్ప ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయం అరకొరగానే అందు తుంది. ఫలితంగా చాలా గ్రామ పంచాయతీలు పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయి. పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలను బకాయి పెడుతున్నాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలనే సిఫార్సును కూడా ప్రభుత్వం తిరస్కరించింది. కేరళలో పూర్తి అధికారాలు.. కేరళ రాష్ట్రం స్థానిక సంస్థలకు అధికారాల బదలాయింపులో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. 73వ రాజ్యాంగ సవరణ చట్టంలో పేర్కొన్న విధంగా 29 అంశాలను స్థానిక సంస్థలకు బదలాయించి, గ్రామ స్వరాజ్యాన్ని, స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహిస్తుంది. విద్యా, వైద్యం, వ్యవసాయం, పశువైద్యం, ఇంజనీరింగ్, సంక్షేమం, నీటి సరఫరా వంటి అన్ని అంశాలనూ గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ సంస్థలే పర్యవేక్షిస్తాయి. గ్రామసర్పంచ్‌కి తెలియకుండాఒక్క నిర్ణయం జరగదు. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర బడ్జెట్ నుంచి నేరుగా 35 నుంచి 40 శాతం నిధులు కేటాయిస్తారు. వీటికి తోడు ఆర్థిక సంఘం నిధులు, పన్నులు, ఇతర మార్గాలలో పంచాయతీలకు ఆదాయం సమకూరుతు ంది. ఒక్కో పంచాయతీ వార్షిక బడ్జెట్ సుమారు రూ.4 నుంచి రూ. 7 కోట్ల వరకూ ఉంటుదంటే అక్కడ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఇక్కడ పంచాయతీల విస్తీర్ణం ఉంటుంది. ఒక్కో పంచాయతీలో జనాభా 20నుంచి 25 వేల మంది వరకూ ఉంటారు. కేరళ రాష్ట్రంలో మొత్తం 941 గ్రామ పంచాయ తీలు, 152 బ్లాక్ పంచాయతీలు, 14 జిల్లా పంచాయతీలు ఉన్నాయి.**గ్రామసభే కీలకం:** కేరళ పంచాయతీల్లో గ్రామసభకు విశేషాధికారాలఉంటాయి. ప్రభుత్వ పథకాలకు లబ్దిదారుల ఎంపిక, అభివృద్ధి కార్యక్రమాల గుర్తింపు, సోషల్ ఆడిట్ వంటివి గ్రామ సభల్లోనే నిర్వహిస్తారు. ప్రతి పంచాయతీలో మూడు స్థాయీసంఘాలు ఉంటాయి. వాటిపై పర్యవేక్షణకు పంచాయతీ అధ్యక్షుడి నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఉంటుంది. వివిధ రంగాల నిపుణులతో అంశాల వారీగా ఫంక్షనల్ కమిటీలు ఉంటాయి. ఇక్కడ గ్రామ పంచాయతీ కార్యాలయం అంటే పూర్తిస్థాయి సచివాలయమే. అన్ని పంచాయతీలకు సొంత భవనాలు ఉండటమే కాకుండా పూర్తిస్థాయి వసతులు అందుబాటులో ఉంటాయి.

# అంతర్జాతీయ పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించిన పోలీస్ అధికారి కుమార్తె మేఘన



గోదావరిఖని:ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించి కాంస్య పతకం సాధించిన ఏసీపీ సాదుల సారంగ పాణి కుమార్తె మేఘన ఈరోజు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ని మర్యాద పూర్వకంగా కలవగా సీపీ ఘనంగా సత్కరించారు. వివరాల్లోకి వెళితే... టిజిపిఎ హైదరాబాద్ లో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ సారంగపాణి కుమార్తె గత కొన్ని సంవత్సరాలుగా పిస్టల్ షూటింగ్‌లో ఐ స్ స్ ఫ్ జూనియర్ ప్రపంచ కప్ 2023, జర్మనీ, జట్టు బంగారు పతకం, ఆసియా ఛాంపియన్‌షిప్ 2023, దక్షిణ కొరియా, జట్టు వెండి పతకం, ISSF ప్రపంచ ఛాంపియన్‌షిప్, దక్షిణ కొరియా 2023లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 3 జాతీయ ఛాంపియన్‌షిప్ పతకాలు మరియు బహుళ తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పతకాలు: జూనియర్ వ్యక్తిగత కాంస్య, జూనియర్ సివిలియన్ కాంస్య, సీనియర్ జట్టు వెండి, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కాంస్య పతకం సాధించడం జరిగింది. విలువిద్యలో జాతీయ స్థాయి పోటీల్లో తన సత్తా చాట్టడం జరిగింది.. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ తన కార్యాలయములో సాదుల మేఘన ని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ పిల్లలను క్రీడల్లో వున్న ఆసక్తి గమనించి వారిని ప్రోత్సహించాలని, ముఖ్యంగా నిరంతరం విధులు నిర్వహించే పోలీసులు సైతం తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిమచడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు పూర్తి సహకారం అందించడం సంతోషదాయకమని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# రుక్మాపూర్ లో ఒంటరి మహిళ దారుణ హత్య

జహీరాబాద్: న్యాల్కల్ మండలం రుక్మాపూర్ లో ఒంటరి మహిళ దారుణ హత్యకు గురైంది. సమాచారం అందుకున్న హద్నూర్ పోలీసులు సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని దుండగులు ఓ మహిళను అతి కిరాతకంగా హత్య చేసి పరారయ్యారు. ఆదివారం రాత్రి రాణమ్మ (46)ను ఇంట్లోకి చొరబడి సీసాలతో పొడిచి, గొంతును నులిమి హత్య చేశారు. ఇంట్లో నుంచి బంగారం, నగదును అపహరించినట్లు సమాచారం. మహిళ హత్య ఘటన తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు పోలీసుల బృందంతో విచారణ చేపడుతున్నారు. దొంగల పనా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చేతులు కడుగుదాం ఇలా



చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ఇన్ఫెక్షన్లు, రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అయితే, దీని ప్రయోజనం అలా ఉంచితే చేతుల పరిశుభ్రత గురించి ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుందాం.

గ్లవ్స్ తొడుక్కుంటే: ఎక్కువసేపు గ్లవ్స్ తొడుక్కోవడం వల్ల సురక్షితంగా ఉంటామని చాలామంది భ్రమలో ఉంటారు. నిజానికి గ్లవ్స్ తొడుక్కొని వస్తువులు ఇతరులకు ఇవ్వడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. వండుతున్నప్పుడు, ఏవైనా వస్తువులు పట్టుకొన్నప్పుడు గ్లవ్స్ వాడుతుంటారు. అయితే, గ్లవ్స్ విడిచిపెట్టిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాల్సిందే. అంతేకాదు గ్లవ్స్‌లో కూడా దుమ్ము, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి ఇతరులకు వ్యాపించవచ్చు. కాబట్టి, గ్లవ్స్ ధరించడం కంటే సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిది.వేడినీళ్లు- చల్లనీళ్లు: హ్యాండ్ వాష్ పనితీరును నీటి ఉష్ణోగ్రత ఏమాత్రం మార్చదు. సూక్ష్మక్రిములు సబ్బు ప్రభావంతో చనిపోతాయి. నీళ్లు అవి వేడివైనా, చల్లటివైనా సబ్బు వదిలిపోవడానికే అని గుర్తుంచుకోవాలి. చేతులు కడుక్కునే విషయంలో చల్లటి నీళ్ల కంటే వేడి నీళ్లు ప్రయోజనకరమని శాస్త్రీయమైన ఆధారాలైతే లేవు.

శానిటైజేషన్-హ్యాండ్ వాష్: హ్యాండ్ వాష్ (సబ్బు) స్థానాన్ని శానిటైజర్ భర్తీ చేయదు. సబ్బుతో చేతులు కడుక్కోవడంతో వచ్చే ఫలితం శానిటైజర్ ద్వారా ఒనగూరదు. అన్ని సూక్ష్మక్రిములతో పోరాటానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం సమర్థంగా పనిచేస్తుంది. శానిటైజ్ చేసుకోవడం దీనికి ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి, చేతులను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల నుంచి తగిన రక్షణ లభిస్తుంది.పద్ధతి అవసరం లేదా: చేతులను సరైన పద్ధతిలోనే కడుక్కోవాలి. అరచేతులు, వెనకభాగం, వేళ్ల మధ్య, బొటనవేలు, గోళ్ల భాగం, మణికట్టు ఇలా అన్ని భాగాలను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఆ తర్వాత శుభ్రమైన తువాలుతో తుడుచుకోవాలి. సరైన విధానం వైద్యుడి ద్వారా తెలుసుకొని ఆచరించడం మేలు.వాష్‌రూం తర్వాత వంటకుముందు: వాష్‌రూంకు వెళ్లివచ్చిన తర్వాత, వంటకు ముందు చేతులు కడుక్కోవాలని సాధారణంగా అనుకుంటారు. అయితే ఇది పరిసరాల్లో మనం ముట్టుకునే వస్తువులను బట్టి ఆధారపడి ఉంటుంది. రైళ్లు, బస్సులు, బాగా జనం ఉన్న ప్రదేశాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు, తలుపు హ్యాండిల్స్, ఫర్నిచర్, స్విచ్చులు, లిఫ్ట్ బటన్లు ఇలా ఎక్కువమంది వాడే వస్తువులను పట్టుకొన్నప్పుడు, మీ ముఖం, కండ్లు, ముక్కు తాకిన సందర్భాల్లో, గ్లవ్స్ ధరించడానికి ముందు ఆ తర్వాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిందే.

# పగటి వెలుగుతో రోగనిరోధక శక్తికి మరింత బలం..

**తాజా అధ్యయనంలో వెల్లడి**

- **ఇన్ఫెక్షన్లతో పోరాడే న్యూట్రోఫిల్స్ సామర్థ్యం మెరుగు**
- **ఆక్లాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల కీలక పరిశోధన**
- **జీబ్రాఫిష్‌లపై అధ్యయనంలో వెలుగులోకి నిజాలు**
- **న్యూట్రోఫిల్స్‌లోని సిర్కాడియన్ గడియారమే కీలకం**
- **భవిష్యత్తులో కొత్త ఔషధాల అభివృద్ధికి అవకాశం**



మనం ఆరోగ్యంగా ఉండటంలో పగటి వెలుతురు కీలక పాత్ర పోషిస్తుందని తాజా అధ్యయనం ఒకటి స్పష్టం చేస్తోంది. శరీరంలోకి ప్రవేశించే ఇన్ఫెక్షన్లతో పోరాడే రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాన్ని సూర్యకాంతి గణనీయంగా పెంచుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో అనేక వ్యాధులకు నూతన చికిత్సా విధానాల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. న్యూజిలాండ్‌లోని వైపప టౌమాట రౌ, ఆక్లాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన చేపట్టింది. మన శరీరంలో అత్యధికంగా ఉండే రోగనిరోధక కణాలైన 'న్యూట్రోఫిల్స్' పై వీరు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ తెల్ల రక్త కణాలు ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతానికి వేగంగా చేరుకుని, హానికర బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. పగటి వెలుతురు ఉన్నప్పుడు ఈ న్యూట్రోఫిల్స్‌లోని 'సిర్కాడియన్ గడియారం' (జీవ గడియారం) ఉత్తేజితమై, వాటి పనితీరును మెరుగుపరుస్తుందని 'సైన్స్ ఇమ్యునాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వెల్లడించింది.పరిశోధకులు ఈ అధ్యయనం కోసం జీబ్రాఫిష్‌ను నమూనాగా ఉపయోగించారు. వీటి జన్యు నిర్మాణం మనుషులను పోలి ఉండటం, శరీరం పారదర్శకంగా ఉండటంతో జీవ ప్రక్రియలను గమనించడం సులభమని వారు తెలిపారు. "పగటిపూట జీవులు చురుకుగా ఉంటూ, బ్యాక్టీరియా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, ఉదయం పూట రోగనిరోధక స్పందనలు అధికంగా ఉండటాన్ని గతంలో గమనించాం" అని మాలిక్యులర్ మెడిసిన్ అండ్ పాథాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ హాల్ వివరించారు. శరీరంలోని చాలా కణాలు బయటి ప్రపంచంలో సమయాన్ని తెలుసుకోవడానికి సిర్కాడియన్ గడియారాలను కలిగి ఉంటాయి. ఈ గడియారాలను రీసెట్ చేయడంలో వెలుతురు ప్రధాన పాత్ర పోషిస్తుంది. "వాపు సంబంధిత ప్రాంతాలకు మొదటగా చేరుకునేవి న్యూట్రోఫిల్సే కాబట్టి, మా ఆవిష్కరణ అనేక వాపు సంబంధిత వ్యాధులకు చికిత్సా ప్రయోజనాలను అందించడంలో చాలా విస్తృతమైన చిక్కులను కలిగి ఉంది" అని హాల్ పేర్కొన్నారు. న్యూట్రోఫిల్స్‌లోని సిర్కాడియన్ గడియారంపై వెలుతురు నిర్దిష్టంగా ఎలా ప్రభావం చూపుతుందనే అంశంపై ప్రస్తుతం పరిశోధన సాగుతోంది. ఈ దిశగా మరిన్ని ఆవిష్కరణలు జరిగితే, ఇన్ఫెక్షన్లతో పోరాడే సరికొత్త ఔషధాల తయారీకి ఆస్కారం ఏర్పడుతుంది.

# ప్రమాదాల నియంత్రణకు చిన్నారుల యోచన






ఇంటి నుంచి ప్రతిరోజూ బయటకు వెళ్తుంటాం. దూరం వెళ్లాంటే ద్విచక్ర వాహనం తప్పనిసరి. హెల్మెట్ లేకుండా వెళ్తే ప్రమాదాలు జరుగుతుంటాయి. అదే బండికి డ్రౌసీ డిటెక్టర్ అమర్చితే హెల్మెట్ లేకుండా బండి అంగుళం కూడా కదలదు. అలాగే వాహనాలు చోరీకి గురి కాకుండా కూడా సెన్సార్ సిస్టం పనిచేస్తుంది. ఈ పరికరాన్ని రూపొందించటమే కాకుండా ఇటీవల పెద్దల ముందు ప్రదర్శించారు పల్నాడు జిల్లాలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు. పల్నాడు జిల్లా గురజాల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూలు విద్యార్థులు సెన్సార్ టెక్నాలజీతో పలు అద్భుతాలు సృష్టిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే కృషిలో వారు భాగస్వాములవుతున్నారు. హెల్మెట్ ధరించకపోవటంతో జరిగే రోడ్ల ప్రమాదాల్లో ప్రతిరోజూ చాలామంది చనిపోతున్న విషయాన్ని వారు తెలుసుకుని చలించిపోయారు. మన దేశంలో గంటకు ఇద్దరు, రోజుకు 58 మంది, నెలకు 1700, ఏడాదికి 20 వేలకు పైగానే ప్రమాదాల కారణంగా రోడ్డున పడుతున్నారనే గణాంకాలను సేకరించారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణమవుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. వాహన ప్రమాదాల్లో అప్రమత్తతతో పాటుగా జాగ్రత్తలు తీసుకుంటే కొంతమేరకైనా ప్రాణనష్టం వాటిల్లకుండా చూడొచ్చునని ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్, సీటు బెల్టు ధరించటం వల్ల వాహన ప్రయాణాల్లో ప్రమాదాలు సింహభాగాన్ని తగ్గించొచ్చునని తెలియజేస్తున్నారు. హెల్మెట్లు, సీటు బెల్టులు లేని కారణంగా ఏపి, తెలంగాణాలో ఏటా 10 వేల మందికి పైగా మృత్యువాత పడుతున్నారు. 20 వేల మందికి పైగా గాయపడుతు న్నారు. హెల్మెట్ పెట్టుకోకపోవటం కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 60 వేల మంది మృతి చెందుతున్నారని అంచనా.ప్రమాదాన్ని ముందే గుర్తించేలా: సెన్సార్ టెక్నాలజీ ద్వారా రోబోటిక్ పద్ధతుల్లో 'డ్రౌసీ డిటెక్టర్', 'స్మార్ట్ హెల్మెట్, బైక్ థెఫ్ అలారమ్'లు రైడర్లకు ప్రమాదాలను ముందే గుర్తించడంలో సహాయం చేస్తాయి. ప్రమాదాలను అరికట్టే ఒక సరికొత్త పరిష్కారంగా 'డ్రౌసీ డిటెక్టర్' దోహదపడుతుంది. దేశంలో ప్రస్తుతం బైక్ రైడింగ్ సమయంలో దారుణమైన ప్రమాదాలు జరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటం, అలసట లేదా నిద్ర వస్తున్న సమయంలో డ్రైవింగ్ చేయటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. అదే డ్రౌసీ డిటెక్టర్‌ను బైక్‌కు అమర్చటం ద్వారా ఈ పరికరం బైక్ రైడర్ జ్ఞానశక్తిని మానిటర్ చేసి, అతనికి నిద్రపోవడం లేదా అలసట వస్తే వెంటనే డ్రౌసీ డిటెక్టర్ హెల్మెట్‌లో అమర్చిన సెన్సార్ల ద్వారా పనిచేస్తుంది. ఇది రైడర్ శరీర భాష, ప్రదర్శనను ట్రాక్ చేస్తుంది. నిద్ర లేదా అలసటగా కనుగొన్నప్పుడు, ఆటోమేటిక్‌గా హెచ్చరిక అలారం పంపిస్తుంది. ఈ అలారం రైడర్‌కు అలెర్ట్‌చేసి ప్రమాదం పొంచివుంది జాగ్రత్త అంటూ హెచ్చరికలు పంపిస్తుంది.యాంటీ థెఫ్ట్ అలారం : స్మార్ట్ హెల్మెట్-బైక్ థెఫ్ అలారమ్ పరికరాలు వాహనం యాజమాన్యానికి సెక్యూరిటీని పెంచే కొత్త మార్గాన్ని అందిస్తున్నాయి. ఈ హెల్మెట్లు బైక్ ట్రాకింగ్ సిస్టమ్‌తో అనుసంధానమై ఉంటాయి. ఎవరైనా బైక్‌ని తీసుకెళ్లటానికి ప్రయత్నించినా, ఏదైనా వాహనంలో ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నప్పుడు ఈ హెల్మెట్ తక్షణమే యజమానికి అలారం పంపిస్తుంది. ఎక్కడున్నా తమ బైక్ సురక్షితమో కాదో తెలియజేస్తుంది. ఈ స్మార్ట్ హెల్మెట్లు ఆధునిక మోషన్ సెన్సార్లను ఉపయోగించి బైక్‌ను అనుమానాస్పదంగా ఎక్కడైనా తరలిస్తే అలారం యాక్టివ్ అవుతుంది. కొంత భాగంలో హెల్మెట్ కూడా డేటా యాక్సెస్ ఇవ్వడం ద్వారా, యజమానికి నోటిఫికేషన్స్ నిరంతరం వస్తూనే ఉంటాయి. అది బైక్ యజమానికి దొరికే వరకూ వస్తూనే ఉంటాయి. తద్వారా యజమానికి తమ వాహనం సురక్షితంగా ఉందనే సమాచారం అందుతుంది. చోరీలు, ఇతర అవాంఛనీయ పరిస్థితుల నుంచి రక్షించుకోవటానికి ఇవి దోహదపడతాయి.సెన్సార్ ఎలా పనిచేస్తుందంటే: ఈ స్మార్ట్ హెల్మెట్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది బైక్ స్టార్టయ్యే ముందు రైడర్ హెల్మెట్ ధరించారా? లేదా? అని గుర్తిస్తుంది. హెల్మెట్‌లో ఏర్పాటు చేసిన సెన్సార్ వ్యవస్థ బైక్‌కు అనుసంధానమై ఉంటుంది. రైడర్ హెల్మెట్ ధరించినప్పుడే బైక్ స్టార్ట్ అవుతుంది. స్మార్ట్ హెల్మెట్‌లో మైక్రో కంట్రోలర్, బ్లూటూత్ మాడ్యూల్, ప్రెషర్ సెన్సార్ వంటి ఆధునిక సాంకేతికాలు ఉపయోగించబడ్డాయి. హెల్మెట్‌లోని ప్రెషర్ సెన్సార్ హెల్మెట్ ధరించినప్పుడు సిగల్‌ను బైక్‌కు పంపుతుంది. ఈ సిగల్‌ను స్వీకరించిన తర్వాతే ఇంజిన్ ఆన్ అవుతుంది. ఈ విషయాన్ని లిటిల్‌ఫ్లవర్ స్కూలు విద్యార్థులు ఇటీవల ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. రెంట చింతల ఎస్ఐ సిహెచ్.నాగార్జున పిల్లల మేథాశక్తిని అభినందించారు. లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ పి.వి.సుబ్బారావు, హెచ్ఎం ఎం.కృష్ణ పర్యవేక్షణలో రోబోటిక్ నిపుణులు, ఎస్ఆర్ఎంయు డైరెక్టర్ దాసరి నరేంద్రకుమార్ నేతృత్వంలో 5, 7, 8 తరగతుల విద్యార్థులు మట్టపల్లి మన్విత్‌రియా, కూరపాటి అశ్విని కీర్తి, మేకల సాయి చరణ్, మేకల అరవింద్, బండి అస్మిత తదితరులు ఈ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించారు.

# ముగ్గురు స్నేహితులు



సిరిపురం గ్రామంలో ఓ పాఠశాల ఉంది. అక్కడ చిన్ను, చిట్టి, చిక్కి అనే ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఒకరోజు వాళ్లు పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు రోడ్డు పక్కన చిన్ను వాళ్ళ అమ్మమ్మ కనిపించింది 'చిన్ను! నాతో మార్కెట్‌కి వస్తావా' అని అడిగింది. అప్పుడు చిన్ను 'అమ్మమ్మ! సారీ, నేను రాను. ఎందుకంటే నా స్నేహితులను వదిలి నీతో వస్తే నాకు చాలా బాధ వేస్తుంది. వాళ్లు కూడా చాలా బాధపడతారు. అని చెప్పింది. 'సరే' అని చెప్పి అమ్మమ్మ అక్కడి నుండి వెళ్ళిపోయింది. అలాగే నడుస్తూ ఇంకాస్త దూరం వెళ్లారు. అప్పుడు చిట్టి వాళ్ళ నాన్న బండి మీద వచ్చి 'చిట్టి బండి ఎక్కుతావా? ఇంటికి వెళ్దాం' అన్నాడు. అప్పుడు చిట్టి, 'నేను నీతో రాను నాన్న. నా స్నేహితులతో నడుచుకుంటూ వస్తాను. నువ్వు ఇంటికి వెళ్లు' అని చెప్పింది. 'సరే చిట్టి జాగ్రత్త' అని నాన్న ఇంటికి వెళ్ళాడు. అలాగే వెళుతుండగా చిక్కి వాళ్ళ అమ్మ, నాన్న, తమ్ముడు బస్టాండ్‌లో కనిపించారు. వాళ్లని చూడగానే చిక్కి చాలా కంగారుగా 'అమ్మ ఎక్కడికి వెళ్తున్నారు?' అని అడిగింది. అప్పుడు వాళ్ళ అమ్మ, 'మేము ఊరికి వెళ్తున్నాము నువ్వు కూడా మాతో రా' అని చెప్పింది. చిక్కి 'సరే' అంది. అప్పుడు చిట్టి, చిన్నుతో 'చూశావా! మనం స్నేహానికి ఎంతో విలువ ఇచ్చి అమ్మమ్మ, నాన్న పిలిచినా వెళ్లలేదు. చిక్కి మాత్రం వాళ్ల అమ్మానాన్నతో ఊరు వెళ్లడానికి సిద్ధమైపోయింది' అని అంది. అప్పుడు చిన్ను, 'అలాంటిదేమీ లేదు.మనం ఇద్దరం ఊళ్లో ఉన్న అమ్మమ్మ, నాన్నతో బయటికి రామని చెప్పాం. కానీ చిక్కి వాళ్ల అమ్మానాన్న ఊరు వెళుతున్నారు. వాళ్లతో అది వెళ్లకపోతే ఎలా? మనం చెప్పిందానికి, చిక్కి చేసిందానికి చాలా తేడా ఉంది. చిక్కిని అపార్థం చేసుకోకు. అది ఊరు బస్సు ఎక్కేవరకు ఇక్కడే ఉందాం' అని చెప్పింది. చిక్కి ఊరు బస్సు ఎక్కగానే చిట్టీ, చిన్ను నవ్వుతూ టాటా చెప్పారు.

## పంట మార్పిడితో అధిక లాభాలు శాస్త్రవేత్త అనురాధ



శామీర్‌పేట, మే 26 : పంట మార్పిడితో అనేక లాభాలు ఉన్నాయని ప్రొపెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధ, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న అన్నారు. ఇవాళ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను ఆద్రాస్‌పల్లి, కేశ్వపూర్ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరం మేరకే రసాయన ఎరువులు ఉపయోగించాలన్నారు. యూరియాను తక్కువగా వాడి ఖర్చును తగ్గించుకోవాలన్నారు. పంట మార్పిడి కారణంగా రైతాంగానికి ఎన్నోలాభాలని భూసారంతోపాటు చీటపీడల బెడద తగ్గుతుందన్నారు. సాగునీటిని ఆదా చేయాలని అధికారుల సలహాలు, సూచనల మేరకు సాగు పద్దతులను పాటించి అధిక దిగుబడులు, లాభాలను గడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లక్ష్మణ్‌గౌడ్, కే.రోహిత, రైతు సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాధవి, లత, బీవోఏలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఈ కాయల గురించి మీకు తెలుసా..?

**ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..?**





టొమాటోలను మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. ఏ కూర అయినా సరే టొమాటోలు లేనిదే పూర్తి కాదు. టొమాటోలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. అయితే టొమాటోల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో రామ ములక్కాయలు కూడా ఒకటి. ఇవి టొమాటోల మాదిరిగానే ఉంటాయి. కానీ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటాయి. ఇవి కూడా టొమాటోల జాతికి చెందినవే. రామ ములక్కాయలు మనకు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభిస్తుంది. సూపర్ మార్కెట్లు లేదా రైతు బజార్‌లలోనూ కొన్ని చోట్ల ఈ కాయలను విక్రయిస్తుంటారు. అయితే టొమాటోలలాగే రామ ములక్కాయలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కళ్ల ఆరోగ్యానికి..: రామ ములక్కాయలను తినడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ కాయల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఈ కాయలు ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే బీటా కెరోటీన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. లుటీన్ అనే మరో యాంటీ ఆక్సిడెంట్ కూడా ఈ కాయల్లో అధికంగానే ఉంటుంది. విటమిన్ ఎ, లుటీన్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. రామ ములక్కాయల్లో ఉండే నారింజైన్, నారింజెనిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. ఇవి కళ్ల వాపులను తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్‌ను అధిక మొత్తంలో పొందాలంటే ఈ కాయలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. పచ్చి వాటికన్నా ఉడకబెట్టిన కాయల్లోనే మనకు లైకోపీన్ అధిక మొత్తంలో లభిస్తుంది. లైకోపీన్ వల్ల గుండె కండరాల వాపులు రాకుండా అడ్డుకోవచ్చు. రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా నివారించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

ఈ కాయల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రామ ములక్కాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ కొవ్వు మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు సైతం కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు సులభంగా తగ్గుతారు.

ఎముకల ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్ క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లైకోపీన్ వల్ల మహిళల్లో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. చర్మం లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు ఈ కాయలను మెత్తని పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఫేస్ ప్యాక్ చేసుకుంటే అందులో కాస్త తేనె కలపాలి. అదే జుట్టుకు వాడితే ఆ పేస్ట్‌లో కాస్త పెరుగు కలిపి వాడాలి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతాయి. ఇలా రామ ములక్కాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.